57414

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

ఫిబ్రవరి 14, 2010

ప్రేమికులకు ఒక రోజ్

హ్యాపీ బర్త్‌డే

(2010 ఫిబ్రవరి 14 నుంచి
2010 ఫిబ్రవరి 20 వరకు)

వర్షన్- రక్షిత
2సం॥,ఫిబ్రవరి-2008
స్వప్న-సుబ్రమణ్యం
ధన-శశికుమార్
మదనపల్లి-చిత్తూరు

రిషిత
1సం॥, ఫిబ్రవరి-16
జ్యోతి-సంజీవరెడ్డి
ముషీరాబాద్-హైదరాబాద్

వి. సంధ్య
ఫిబ్రవరి
రాజమణి-పెద్దులు
సీతంపేట్-కరీంనగర్

పండు
3సం॥, ఫిబ్రవరి-2007
భాగ్యలక్ష్మి-సురేష్
రావిరాల-రంగారెడ్డి

ఎస్‌కె. సఖిభ్
1సం॥,ఫిబ్రవరి-15
తస్లీమ్-గౌస్ భాషా
బుచ్చి-నెల్లూరు

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

ENTERED

ధా నిలయం
గ్రంథాలయం

మనలో మాట



శివరాత్రి స్పెషల్

పండగొచ్చిందంటే పిల్లలకూ పెద్దలకూ ఎవరికైనా ఎంతో కొంత వేడుకే.

"బుజ్జికిష్టమని అది వండాను. చంటోడికిష్టమని ఇది చేశాను" అని చెప్తుంటారు నోట్లోకి ఐదువేళ్ళు వెళ్లే ఇళ్లలోని పెద్దవాళ్లు మురెపంగా. పిల్లలు కూడా గారాంగా "అమ్మా...అది వండిపెట్టవూ...ఇది చేసిపెట్టవూ.." అని దీర్ఘాలు తీస్తూ అడిగి చేయించుకుంటుంటారు.

కాసింత కలిగిన వాళ్ల ఇళ్లల్లో దంతధావనం, స్నానపానాదుల అనంతరం గారెలతో ఆరంభిస్తే...రకరకాల ప్రీతిపాత్రమైన వంటకాలతో పండుగ రోజు ముగుస్తుంది.

పురుషులలో పుణ్యపురుషులు వేరయా అన్నట్టు... పండగలలో శివరాత్రి రూట్ మాత్రం వేరు. దీనికి ఇతర పండగలకు అస్సలు పోలికే వుండదు.

చంకల్లో చేతులు పెట్టుకునేంత చలిరోజుల్లో సంక్రాంతి వస్తుంది. మరి శివరాత్రో! 'శివ..శివా..' అంటూ చలి తుర్రుమనే వేళ వస్తుంది. పిండివంటల విషయంలోనూ అంతే! అరిసెలు, బూరెలు, గారెలు, పరవాణ్ణం...ఏదీ వుండదు శివరాత్రికి. మరీ నిష్ఠగా చేసేవారికైతే మంచితీర్థం పుచ్చుకునే భాగ్యం కూడా వుండదు. అంతా ఆది మధ్యాంత రహితుడి దయ!

దేవుళ్లలో నిజంగానే ఈశ్వరుడు స్పెషల్ దేవుడు. మిగతా వారంతా వంటినిండా ఆభరణాలతో దర్శనమిస్తే...శివుడు బూడిద పూసుకుని రుద్రాక్షలు కట్టుకుని పులి చర్మం చుట్టుకుని మెడలో పాముని వేసుకుని విలాసంగా శ్మశానాల్లో సంచరిస్తుంటాడట.

శివుడు అభాగ్యుల దేవుడేనేమో. ధరలు చుక్కలనంటి మూడుపూటలా తినడం కష్టమౌతున్నవేళ... శివరాత్రి వచ్చిందికదా అని బాధపడనక్కర్లేదు మరి. ఆకసానికి నిచ్చెనలేసి సరుకులు కొనలేని బీదవారికి నిజానికి ప్రతి రోజూ శివరాత్రే... ఇవాళ కడుపు కాల్చుకుంటే కూసింత పుణ్యం బోనస్‌గా దక్కుతుందని వాళ్లంతా సంతోషపడవచ్చు కదా.

అన్నీ 'ఎక్కువైన' వారికి ఉపవాసం ఆరోగ్య సూత్రం. శివరాత్రి పుణ్యమా అని నోటికి తాళం వేస్తారు ఆనందంగా.

కడుపుకు తిండి వుండదు కాబట్టి రాత్రికి నిద్ర వుండదు. బహుశా అందుకేనేమో జాగరణ కార్యక్రమం. పాతకాలంలో గుళ్లు శివరాత్రినాడు కిటకిటలాడేవి. భజనలు మిన్నంటేవి. ఇప్పుడు అవెలాగూ వున్నాయి. వాటితోపాటు జాగరణ కోసం పేకాట. టీవీల్లో అర్ధరాత్రి దాటాక మూడున్నర గంటల భక్తిరస సినిమాలు. వాటి మధ్యలో వచ్చే వాణిజ్య ప్రకటనల మోతాదు ఎక్కువైతే ఒక్క సినిమాతోనే తెల్లారిపోతుంది. మాయలు మంత్రాల ఎఫెక్టు కోసం ఆ చిత్రరాజాల్లోని స్పెషల్ శబ్దాలు, అడపాదడపా వినవచ్చే వికటాట్టహాసాలు సినిమా చూడదల్చుకోని వారికీ నిద్ర కరువు. ఏం చేస్తాం. శివరాత్రి ఎవరికైనా శివరాత్రేమరి.

శివ...శివా...!!!

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
సినిమా కబుర్లు	...	7
ఆరోగ్యం	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
సూక్ష్మంలో మోక్షం - ఘరానా మోసం	...	17
సీరియల్	...	18
నవ్వుల్ పువ్వుల్	...	20
క్రైమ్‌కథ	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

విశ్వనాథ నుంచి
విప్లవ కవిత దాకా...



కథ ... 8
నీకోసమే జీవించునదీ....

చూద్దామా ... 22
అద్భుత శిల్పాల ఝరి
అమరావతి



స్పందింపచేసిన సాహసాలు

ఈ వారం స్నేహలో సాహసబాలల విశేషాలు మంచి స్పందన కల్గించేవిగా వున్నాయి. చిన్నతనం నుండి చాలామంది తల్లిదండ్రులు నేటి సమాజంలో ధైర్యసాహసాలు నేర్పించడంలేదు. బూచోడు, బూచోడు వచ్చి ఎత్తుకుపోతాడు... లాంటివి ఉగ్గుపాలతో అలవాటు చేస్తున్నారు. అలా నేర్పితే వాళ్లు పెరిగి పెద్దైనా పిరికివాళ్లలా, ముద్దపప్పుల్లా తయారవుతారు. ఈ వ్యాసం ఎందరో తల్లిదండ్రులు తమ బిడ్డలకు ధైర్యసాహసాలు చెప్పడానికి మంచి స్ఫూర్తినిస్తుంది. తెలుగు చలన చిత్రసీమలో గుమ్మడి వెంకటేశ్వరరావు గారు తొలిరోజుల్లోనే అద్భుతమైన స్థానం సంపాదించుకున్నారు. అనేక నూతన నటీనటులకు గొప్ప స్ఫూర్తిని కలిగించారు. నాన్నంటే గుమ్మడిలా వుండాలని తెలుగు ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారు. గుమ్మడి గారి విశేషాలు తెలకపల్లి రవిగారి విశ్లేషణ వల్ల అనేక కొత్త సంగతులు తెలుసుకున్నాం. ఆయన ఒక అమర నటుడు. నూత్తన రచయితలను ప్రోత్సహిస్తూ వారం వారం చిన్నకథలను మీరు ప్రచురణ చేస్తున్నందుకు చాలా సంతోషంగా వుంది. ఇటీవల వస్తున్న కథలు మంచి స్పందన కలిగిస్తున్నాయి. నూతన రచయితలను, రచయిత్రులను మరింత ప్రోత్సహించవలసిందిగా కోరుతున్నాం. ఈవారం ప్రచురించిన పూరి జగన్నాథ స్వామి వారి ఆలయ విశేషాలు కూడా మనస్సుకు హత్తుకున్నాయి.

జ్యోతిమహంతి, సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

గుమ్మడిని మరువలేం

జనవరి 31 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో 'గుమ్మడి పెద్దరికానికి ఒరవడి' చదివాం. అయితే తన అత్యుత్తమ నటనతో కోట్లాది మంది ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిన గుమ్మడి చనిపోయాడనే వార్తను నమ్మలేకపోతున్నాం. కమ్యూనిస్టు భావజాలానికి ఆటపట్టయిన గుంటూరు జిల్లాలో జన్మించి, 1945లో లక్ష్మీ సరస్వతితో వివాహం, స్టూడెంట్ ఫెడరేషన్‌లో పనిచేయడం, పుచ్చలపల్లి సుందరయ్య, హనుమంతరావు, రాజేశ్వరరావుల ప్రేరణతో రంగస్థలంలోకి ప్రవేశించి అదృష్ట దేవుడు సినిమాలో నటించి, వందలాది సినిమాల్లో అన్ని రకాల పాత్రలు వేసిన గుమ్మడిని నిజమైన హీరోగా చెప్పొచ్చు. ఎన్.టి.ఆర్‌కి గుమ్మడికి మధ్య వున్న స్నేహం వెలకట్టలేనిది. అనేక చిత్రాలలో కలిసి నటించిన ఖ్యాతి వారిది. మిస్సమ్మ, పెళ్లిసందడి, తాతామనవడు, పెళ్లిపుస్తకం సినిమాల్లో ఆయన నటన భేష్. సత్కారాలు – పురస్కారాలు ఎన్నో అందుకున్న గుమ్మడి భౌతికంగా మన ముందు లేకున్నా ప్రతి తెలుగు వారి మదిలో వుంటాడు.

కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్.

ఆలోచింపచేసిన సినిమా కబుర్లు

జనవరి చివరి వారం స్నేహ సంచికలో గుమ్మడి గారి ముఖచిత్రంగా వచ్చిన అట్టమీది కథ ద్వారా గుమ్మడి గురించి ఎన్నో జ్ఞాపకాలను మేము గుర్తు గుర్తుచేసుకునే అవకాశం కల్పించడం అపురూపంగా అనిపించింది. 'సినిమా కబుర్లు' ఈవారం ఆలోచనాత్మకంగా వున్నాయి. "అమ్మ బొజ్జలో.." చిత్రావళి నిజంగా అపూర్వంగా వుంది. కవిత్వంలో జ్యోతిబసుగారికి ఘనమైన అక్షరనివాళి ఘటించినట్లనిపించింది. ఆరోగ్యం ఫీచర్‌లో క్యాన్సర్ మహమ్మారిని ఎలా ఎదుర్కోవచ్చో డా.కె.శివబాబుగారు ఎంతో చక్కగా అర్థమయ్యేలా మాకందించినందుకు కృతజ్ఞతలు. "బాలనేస్తాలు"లో ఈవారం కాలక్షేప శీర్షికల స్థానంలో ఎంతో స్ఫూర్తిదాయక అంశాలను అందరికీ చైతన్యదీప్తి కలిగింపజేసే విధంగా అందించడం శ్లాఘనీయం. కొంపముంచే ఇ-మెయిల్స్ నుంచి అప్రమత్తం చేసే ప్రయత్నంలో సత్యగారి స్కెచ్ అందరూ చదివి, అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. 'మనలోమాట'... మానవుడా మజాకా చూసి సాక్షాత్తు దేవుడనేవాడుంటే నేను సృష్టించిన మనిషికిన్ని తెలివితేటలా అని ఆశ్చర్యంలో మునిగి తేలుతాడు...!

నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

సీరియల్ ఆసక్తికరం

జనవరి 31 ఆదివారం అనుబంధంలో కవర్‌పేజీపై వచ్చిన గుమ్మడి ముఖచిత్రం, గుమ్మడి కవర్‌స్టోరీ ఎంతో బాగున్నాయి. తెలుగు సినిమాలో నాన్నగారు అంటే గుమ్మడి అన్న పేరు స్థిరపడిపోయింది. చిన్నవయసులోనే తనకన్నా వయసులో పెద్దవాళ్లయిన నటులకు తండ్రిగా, అన్నయ్యగా నటించడం గుమ్మడికే చెల్లింది. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు, నాటకాలపై ఉన్న ఆసక్తే ఆయన్ని నటుణ్ణి చేసింది. జ్యోతిబసుకు నివాళిగా చక్రవర్తి, జావెద్‌గారి కవిత్వమ్ చాలా బాగుంది. సినిమా కబుర్లలో '1940లో ఒక గ్రామం'



గురించి వివరంగా తెలుసుకున్నాం. అందరూ అరుంధతికి అవార్డు వస్తుందని అనుకున్నారు. కానీ మూఢనమ్మకాలు, తాంత్రిక పూజలతో అవార్డు రేసులో వెనుకబడింది. వియత్నాం గెరిల్లా సీరియల్ ఆసక్తిగా సాగుతోంది. కథ, క్రైమ్‌కథలు రెండూ బాగున్నాయి.

అజయ్‌కుమార్, చిలకలూరిపేట.

కవర్‌స్టోరీ సంచికకే హైలైట్

జనవరి 31 ఆదివారం సంచికలో కవర్‌స్టోరీ 'గుమ్మడి పెద్దరికానికి ఒరవడి' హైలైట్. తెలుగు చలనచిత్ర ఆవిర్భావం1935 నుండి నేటి వరకు ఎందరో మహానటులు ఎన్నెన్ని పాత్రలు ధరించినా ప్రేక్షక హృదయాల్లో చిరంజీవిగా నిలిచినవారు కొద్దిమందే. వారిలో సాటిలేని మేటి గుమ్మడి. మిస్సమ్మలో కొద్దినిమిషాలు మాత్రమే నటించిన గుమ్మడి క్రమక్రమంగా ఎదిగి ఆంగిక, వాచిక, నయనాభి నటనతో ఎన్నో చిత్రాలలో జీవించారు. బలరాముడంటే గుమ్మడే అనిపించారు. జయభేరిలోశాస్త్రిగా వారి నటన పరాకాష్టకు చేరింది. నాటక, సినీ రంగాల్లో ఉన్నతస్థితి పొందారు. విభిన్న పాత్రలు పోషించి తుదివరకు గీటుదాటని రాటుదేలిన మహామనిషి గుమ్మడి.

ఆచార్య నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం, హైదరాబాద్.

★

స్వీట్ వడ

కావలసిన పదార్థాలు

మినపప్పు - 1కప్పు, అరటిపళ్లు - 2
పంచదార - 1టేబుల్ స్పూన్
యాలకులు - 2, నెయ్యి లేక డాల్డా - 200గ్రా

తయారు చేసేపద్ధతి

మినపప్పు నానబెట్టి కడిగి రుబ్బాలి. అరటిపళ్లు తొక్కతీసి మెత్తగా చెయ్యాలి. అరటిపండు గుజ్జు, రుబ్బిన మినప్పిండి రెండూ కలపాలి. అరటిపండు గుజ్జు కలపగానే కొంచెం పలచగా అవుతుంది. అందులో పొడిచేసిన యాలకులు, పంచదార కలపాలి. ఒక చెంచాడు తీసుకుని అరిటాకు మీద వడలాగా చేసుకుని కాగిన నెయ్యి లేక డాల్డాలో వేయించాలి.

మద్రాసు అప్పడాలు

కావలసిన పదార్థాలు

బియ్యం - పావుకిలో
మినప్పప్పు - కిలో
ఉప్పు - తగినంత
జీలకర్ర - 1టేబుల్ స్పూన్
ఇంగువ - కొంచెం
కొత్త సున్నం - 1టీస్పూన్
నల్లేరు - కొంచెం
కొబ్బరి నూనె - 1స్పూన్

తయారుచేసే పద్ధతి

బియ్యాన్ని కొద్ది సేపు నానబెట్టి నీళ్ల మొత్తం తీసి పిండి చేసుకోవాలి. మినపప్పును కూడా కొద్దిగా నానిన తర్వాత ఎండబెట్టాలి. బాగా ఎండిన తర్వాత తిరగలిలో వేసి మెత్తగా పిండి చేయాలి. ఇంగువను ఒక కప్పు నీళ్లలో వేసి కలపాలి. ఈ ఇంగువ నీళ్లు పాలలా తెల్లగా వుంటాయి. మరో కప్పు నీళ్లు తీసుకుని అందులో ఉప్పు, సున్నం వేసి కలపాలి. నల్లేరును మెత్తగా రుబ్బి ఆ రసాన్ని వడకట్టి ఒక కప్పులో తీసుకోవాలి. మినప్పిండిలో ఉప్పు, సున్నం కలిపిన నీళ్లు, ఇంగువ పాలు, సగం నల్లేరు రసం, జీలకర్ర వేసి కలపాలి. ఇది పొడి పొడిగా వుండాలి కానీ మరీ మెత్తబడిపోకూడదు. చేతితో కలిపితే అంటుకుంటుంది. అందుకని చేతికి కొబ్బరి నూనె పట్టించుకోవాలి. ఇలా కలుపుతూ మిగిలిన నల్లేరు రసం కొద్దికొద్దిగా పోస్తూ వుండాలి. ఇలా ముద్ద కింద చేసి రెండుమూడు గంటలు బాగా నాననివ్వాలి. బాగా నానిన తర్వాత రోట్లో వేసి కుమ్మాలి. అలా కుమ్మగా కుమ్మగా జిగురు వస్తుంది. జిగురు వచ్చేదాకా ముద్దగా చేస్తూ వుండాల్సిందే. జిగురు పక్వానికి వచ్చాక చిన్న చిన్న వుండలుగా చేసుకోవాలి. అవి ఆరిపోకుండా తడిగుడ్డను కప్పి వుంచుకోవాలి. అప్పడాల పీట మీద కొద్దికొద్దిగా వరిపిండి











జల్లుకుని ఈ మినపవుండలను వుంచి సన్నగా అప్పడాలుగా తయారుచేసుకోవాలి. ఎంత సన్నగా చేస్తే అంత బాగుంటాయి. ఒక్కరోజులో అన్నీ చేయడం కుదరదు. నెమ్మదిగా చేసుకోవచ్చు. పిండి నిల్వ వుంటుంది. అప్పడాలను ఎండలో వుంచితే ఎండుతాయి.

అరటికాయ పొడి

కావలసిన పదార్థాలు

అరటికాయలు - 2, పసుపు - చిటికెడు
మినపప్పు - 1టీస్పూన్, ఆవాలు - 1టీస్పూన్
ఎండుమిర్చి - 6, జీలకర్ర - కొంచెం
ఉప్పు - చాలినంత, కరివేపాకు - 2 రెబ్బలు
నూనె - పావుకప్పు, నిమ్మకాయ - 1
చింతపండు - కొంచెం

తయారుచేసే పద్ధతి

అరటికాయలను రెండు ముక్కలు చేసి నీళ్లలో ఉడికించాలి. బాగా వుడికిన తర్వాత తొక్క తీసి ముక్కలుగా చిదమాలి. కొద్దిగా చింతపండు రసం తీసి అందులో పసుపు, ఉప్పు కలిపి అరటి పొడిలో వేసి బాగా కలపాలి. మూకుడులో నూనెపోసి బాగా మరగనివ్వాలి. తర్వాత మినపప్పు, తురిమిన ఎండు మిరపకాయలు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకు బాగా వేయించాలి. అవి వేగాక అరటిపొడివేసి మూతపెట్టాలి. కాసేపు అలా వుండనిస్తే మగ్గుతుంది. పొయ్యిమీదినుంచి దింపిన తర్వాత నిమ్మకాయ పిండితే అన్నంలో తినేటప్పుడు చాలా రుచిగా వుంటుంది. కారం ఎక్కువ కావాలనుకునేవారు కొంచెం కారంపొడి వేసుకోవచ్చు. ఇష్టమైన వారు మసాలా పొడి కూడా వేసుకుంటే ఘాటుగా వుంటుంది.

కలగూర సూప్

కావలసిన పదార్థాలు

బంగాళదుంపలు - 2, క్యారెట్ - 2
క్యాబేజీ - 100గ్రా, టొమేటోలు - 2
ఉల్లిపాయ - 1, వెల్లుల్లి - 2 రెబ్బలు
బెండకాయలు - 6, బీన్స్ - 6
నిమ్మకాయ - 1, వెన్న - 1టేబుల్ స్పూన్
ఉప్పు - తగినంత, పసుపు - చిటికెడు
పచ్చిమిర్చి - 10, ఎండుమిర్చి - 6
లవంగాలు - 4

తయారుచేసే పద్ధతి

దుంపలు, టొమేటోలు, క్యాబేజీ, ఉల్లిపాయ, బెండకాయలు, బీన్స్, పచ్చిమిర్చి ముక్కలుగా తరిగివుంచాలి. ఈ ముక్కలు ఒక పాత్రలో పోసి ముక్కలు మునిగేటట్టు నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. మూకుడులో నూనెపోసి బాగా మరిగిన తర్వాత వెల్లుల్లి రెబ్బలు, ఎండుమిర్చి వేసి పోపు పెట్టాలి. తర్వాత నిమ్మకాయ పిండుకుంటే బాగుంటుంది. ఇందులో వేడినీళ్లుపోసి పొయ్యిమీద వుంచితే రసం తేరుకుంటుంది. నీళ్లు ఎన్నయినా పోసుకోవచ్చు కానీ, ఆ పరిమితిలో ఉప్పు, కారం తగులుతుంటేనే నోటికి రుచిగా వుంటుంది.

★

స్ఫూర్తి



అద్దేపల్లి రామమోహనరావు,
ప్రముఖ సాహితీవేత్త.

విశ్వనాథ నుంచి విప్లవ కవిత దాకా...

నేను బిఎ(1954- 56) చదివేదాకా సాహిత్యమంటే తెలియదు. తెలుగు ముఖ్యాంశంగా చదవడమూ, ఉన్నత స్థాయిగల కవి పండితులైన గురువులూ ఉండడం వల్ల తెలుగు కవిత్వంపై ఆసక్తి కలిగింది. ఒక మిత్రుని వల్ల విశ్వనాథపై ఇష్టం పెరిగింది. అప్పట్లో ఆయన సంప్రదాయవాదో, మరొకటో ఏమీ తెలియదు. 'వేయిపడగలు' ఒకే ఒక్క విడతలో, అనేక ఘట్టాల్లో కన్నీరు కారుస్తూనే చదివాను. విదేశ విష సంస్కృతి మన సంస్కృతిని ధ్వంసం చేస్తోందన్న ఆవేదన వదుల్చుకోలేని ముద్ర వేసింది. ఆయన చెప్పే పరిష్కారాలో, ఇతరాంశాలో నాకు పట్టలేదు.

> 1965 తర్వాత జీవన మార్గంలో ఆలోచనా చైతన్యంలో నాలో వచ్చిన మార్పు అత్యంత మౌలికం. ఇందుకు రెండు అంశాలు దోహదపడినై. మొదటిది నా జీవితంలోని పరిస్థితులవల్ల ప్రతిఘటనా శక్తి తీవ్రం కావడం. రెండోది ఆ చైతన్యానికి అన్వయించే శ్రీశ్రీ 'మహాప్రస్థానం'. తెలంగాణా ఉద్యమ కవిత్వం, మిగిలిన ఆధునిక సామ్యవాద రచనలన్నీ పఠించడం. శ్రీశ్రీ మహాప్రస్థానం చదివినప్పుడు, ఆయన వినూత్న శైలికీ, కలిగించిన అపూర్వ ఆవేశ పూర్వక అనుభూతి శక్తికీ, అట్టడుగు వర్గాల బాధల్ని పలికించిన రీతికీ మనస్సు కదిలిపోయింది.

క్రమంగా ఆయన నవలలూ, కవిత్వమూ అందినంతవరకూ ఆబగా చదివాను. తర్వాత ప్రాచీన కవుల కావ్యాలు, టాగూరు, కృష్ణశాస్త్రి, మిగిలిన భావకవుల రచనలు అన్నీ చదివాను. పద్య కవుల సమగ్ర శిల్పాన్ని పరిశీలించడమనేది విశ్వనాథ విమర్శ గ్రంథాల వల్ల నాలో ఏర్పడిన ప్రత్యేకరీతి. విశ్వనాథ ఛాందస పండితుల్లా, వ్యాకరణం, ధర్మోద్ధరణ మొదలైన అంశాలు కాకుండా, కథలోని నిర్మాణ కౌశలమూ, ఔచిత్యమూ, శైలివల్ల కలిగే భావపరిపుష్టి మొదలైన అంశాల్ని లోతుగా పరిశీలించేవారు. భావకవుల అద్భుతమైన అభివ్యక్తి గొప్ప సౌందర్య ముద్ర వేసింది. కృష్ణశాస్త్రి భావచిత్రాలు వెంటాడేవి. టాగూరు గీతాంజలి, స్ట్రేబర్డ్స్ ఎంతగానో ఇష్టంగా వుండేవి. నాకు నేను అన్నీ అనువదించుకున్నాను. ముఖ్యంగా ఆయన రాసిన 'చిత్ర' అనే కవితా నాటకం నన్ను ఎన్నిసార్లో చదివింపచేసింది. ఆ తర్వాత నేను రాసిన 'సంఘం శరణం గచ్ఛామి' అనే వచన కవితా నాటక శైలికి ఆ నాటకం ప్రేరణ కలిగించింది.

ముఖ్యంగా ఆరోజుల్లో ప్రాచీన కవిత్వాన్ని చాలా విశ్లేషణాత్మకంగా చదివేవాణ్ణి. మాకు బిఎలో ప్రసిద్ధకవి పువ్వాడ శేషగిరిరావుగారు, తిక్కన భారతంలో కొన్ని భాగాలు పాఠం చెప్పారు. తిక్కన నాటకీయశైలి మీద, తెలుగు శిల్పంమీద గొప్ప అభిప్రాయం ఏర్పడింది. ఆముద్రతోనే అనంతర కాలంలో తిక్కన ద్రౌపది పాత్రమీద, ఉత్తర రామాయణం మీద వ్యాసాలు రాశాను. మను చరిత్ర మూడవ ఆశ్వాసం తర్వాత నుంచి చివరి వరకూ ఎవరూ శిల్పపరిశీలన చెయ్యలేదు. అందువల్ల నేను నాల్గవ ఆశ్వాసం నుంచి చివరి దాకా ఉన్న పద్యాల్లోని నిర్మాణ చాతుర్యాన్ని విశ్లేషిస్తూ వ్యాసం రాశాను. అనంతర కాలంలో ఎమ్.ఎలో మాకు గురువుగారైన తిమ్మావఝుల కోదండరామయ్యగారు



యువభారతి ప్రచురణల్లో 'మనుచరిత్ర'కు సంపాదకత్వం వహించినప్పుడు, నేను రాసిన వ్యాసాన్ని ముందుగా ప్రచురించారు. అది నాకు ఎంతో ఆనందం కలిగించింది. అందరూ చెప్పున్న విషయాలుగానే, కొత్తదేదో చెప్పాలన్న స్ఫూర్తి నాకిచ్చింది విశ్వనాథ విమర్శ మార్గమే. ప్రాచీన కవుల్లో నాకిష్టమైన వాళ్లు తిక్కన, పాల్కురికి సోమన, పింగళి సూరన, కట్టమంచివారి 'కవిత్వ తత్వ విచారం' వల్ల పింగళి సూరనపై ఎనలేని అభిమానం కలిగింది.

ఒకనాడు బందరు హిందూ కాలేజీ లైబ్రరీలో ఏదో ఒక వ్యాసం చదువుతుంటే అందులో జాషువా రాసిన ఈ కింది పద్యం ఉంది.

'నా కవితా లతాంగి వదనమ్ము నెగాదిగా చూచి రూపు రే
ఖారమణీయ వైఖరులు గాంచి, భళీయని మెచ్చువారె,మీ
దేకులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున క్రుమ్మినట్టగును పార్థివచంద్ర! వచింప సిగ్గగున్!'

నాకు జాషువా కవి గురించి అప్పటివరకు ఏమీ తెలియదు. పై పద్యం నా గుండె కరిగించి కన్నీరు కార్పించింది. నన్ను వెంటాడింది. తర్వాత జాషువా కావ్యాలన్నీ చదివాను. అనంతర కాలంలో జాషువా కవిత్వంపై చాలా రాశాను.

వివేకానందుడి రచనల్ని పిచ్చిగా చదివేవాణ్ణి. ఆయనలోని వేదాంతం, మతమూ కాదు నాకిష్టమైనవి. ఆయన నాకు మానవశక్తికి ప్రతీకగా కనిపించేవాడు. ఆయన చెప్పిన ఒక మాట ఈనాటికీ నాకు స్ఫూర్తినిస్తుంది. మానవులలో ఒకడు మహాశక్తిని సాధించాడంటే, నువ్వూ మానవుడివే కాబట్టి దాన్ని నువ్వూ సాధన చేస్తే తప్పక సాధించగలవు! నాకు మొదట్లో లేనివెన్నో తర్వాత అభివృద్ధి కావడం వెనక ఈ స్ఫూర్తి తప్పనిసరిగా వుంది. అలాగే ఆ రోజుల్లో జిడ్డు కృష్ణమూర్తివల్ల బాగా ప్రభావితుణ్ణయ్యాను. నేనెప్పుడూ అభౌతిక వేదాంతాన్ని, భావవాదాన్ని నమ్మలేదు. కొద్ది కొద్దిగా నమ్మకాలుంటే అవన్నీ పరిణామక్రమంలో అదృశ్యమయ్యాయి. నాకు మానసిక పరిణామం ఎంత లోతుగానైనా

జరగవచ్చుననే నమ్మకం వుంది. అనుభూతిమీద విశ్వాసం వుంది. అది ఎంతో హేతుబద్ధంగా జె.కె.రచనల్లో దొరికింది. ఆయన తన ఆత్మీయ సోదరుడు చనిపోతే, కొన్ని కవితలు రాశారు. ఆ కవితల్లో విషాదమూ తాత్వికతా కలిసి ప్రవహించాయి. ఆ కవితలన్నీ నేను అనువదించుకున్నాను.

నేను 1960-62 మధ్య ఎం.ఎ చదివాను. తెలుగు ముఖ్య విషయం. తర్వాత మళ్లీ బందరులో లెక్చరరుగా పనిచేశాను. బిఎ నుంచి సుమారు 65 వరకూ నాలోని ప్రధాన చైతన్యం ప్రాచీన, భావకవిత్వాల కేంద్రీకరణగానే వుంది. సమకాలీన కారణాల వల్ల కొంతగా ఆధునిక ఆలోచనలూ వున్నై. శిల్ప, అనుభూతి, నిర్మాణవిమర్శ, శబ్ద శక్తి విషయాలకు సంబంధించిన పునాదిపైన చెప్పిన వివరాలవల్ల దృఢపడింది.

కొంతమందికి మొదట్నించీ చివరి వరకూ, చదివే పుస్తకాల్లోని వస్తువూ వారిష్టపడే సిద్ధాంతాల పరిధి, అటూ ఇటుగా ఒకేవిధంగా కొనసాగుతుంది. నా విషయంలో అలా కాదు. ఏ అంశాలైనా, ఎంత విరుద్ధాంశాలతో కూడినవైనా, ఉత్తమస్థాయిలో వుంటే అన్నీ చదువుతాను. అందర్నీ వింటాను. అయితే నా భావాల గీటురాయితో పరిశీలించి, కావలసినవే గ్రహిస్తాను. కానివాటిని వదిలేస్తాను. అందుకే నాకు మొత్తంగా ఒక రచయితను తీసి అవతల పడెయ్యడమన్నది అలవాటు కాలేదు. ఎవరు చెప్పినవైనా, మన చైతన్యంలో కలిసిపోయినంతవరకు స్వీకరిస్తాను. అందుకే విమర్శసూత్రాల్లో కవి పరిణామ క్రమం తప్పక వుండాలని నేను భావిస్తాను. ఒక రచయిత ఎప్పుడో రాసిన విషయాన్నిబట్టి నిందించడం, లేదా ఇప్పుడు రాసినవాటికి ఎప్పటి సూత్రాల్నో అన్వయించడం ఏమాత్రమూ సరైన విధానం కాదు.

సాహిత్యానికి సంబంధించినంత వరకు భావాలు స్థిరపడే దశలో వున్నప్పుడు ఎవరు మనకు వస్తువుతోగాని, అభివ్యక్తితోగాని గుండె దగ్గరకువస్తే వారిపట్ల మనకు వీరాభిమానం వుంటుంది. వారి తప్పులు కూడా ఒప్పులుగానే సమర్థించే ప్రయత్నాలు చేస్తాం. కానీ, మనం క్రమేణా సమాజంలో ఒక వ్యక్తిగా పెరుగుతున్నప్పుడు, ఇంకా వీరపూజలోనే వుంటే మనం ఏమాత్రం ఎదగలేదని అర్థం. అంతక్రితం ఆరాధించిన వారిలోని గొప్పదనం ఇప్పటికీ నచ్చడం వేరు విషయం. కానీ లోపాలు కూడా తెలుసుకుని, దేనికదిగా చూడగలశక్తిని సాధిస్తాం. ఈ పరిణామక్రమం చాలా మందితోపాటు నాలోనూ వుంది. ఇదే నా సాహిత్య పఠన ప్రస్థానంలో కీలకమైన అంశం.

1965 తర్వాత జీవన మార్గంలో ఆలోచనా చైతన్యంలో నాలో వచ్చిన మార్పు అత్యంత మౌలికం. ఇందుకు రెండు అంశాలు దోహదపడినై. మొదటిది నా జీవితంలోని పరిస్థితులవల్ల ప్రతిఘటనా శక్తి తీవ్రం కావడం. రెండోది ఆ చైతన్యానికి అన్వయించే శ్రీశ్రీ 'మహాప్రస్థానం'. తెలంగాణా ఉద్యమ కవిత్వం, మిగిలిన ఆధునిక సామ్యవాద రచనలన్నీ పఠించడం. శ్రీశ్రీ మహాప్రస్థానం చదివినప్పుడు, ఆయన వినూత్న శైలికీ, కలిగించిన అపూర్వ ఆవేశ పూర్వక అనుభూతి శక్తికీ, అట్టడుగు వర్గాల బాధల్ని పలికించిన రీతికీ మనస్సు కదిలిపోయింది. అంతకు ముందు నాలో ప్రాచీన శిల్ప నేపథ్యం వుండడం వల్ల శ్రీశ్రీ ప్రాచీన స్పృహను నవీనత కోసం ఎలా మలుచుకున్నాడో, శబ్దాల్నీ, అర్థాల్నీ ఎలా ఆధునికం చేశాడో అర్థమైంది. ఆ పునాది మీదనుంచే మహాప్రస్థానంపై 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' అనే విశ్లేషణ గ్రంథాన్ని ప్రచురించాను. క్రమంగా తెలంగాణా ఉద్యమ కవిత్వమూ (ముఖ్యంగా కుందుర్తి తెలంగాణా, అరుద్ర 'త్వమేవాహం') మిగిలిన సామ్యవాద కవిత్వమూ చదవడం వల్ల మార్క్సిజంపై అభిమానం కలిగింది. అధ్యయనం పెరిగింది. అభ్యుదయ కవులు విస్తరింపచేసిన వచన కవితోద్యమమూ, దిగంబరోద్యమమూ, విప్లవకవిత్వమూ ఒకదాని తర్వాత ఒకటి చైతన్యాన్ని విస్తృతం చేసినై.



అంతకు ముందు నాలో ప్రాచీన శిల్ప నేపథ్యం వుండడం వల్ల శ్రీశ్రీ ప్రాచీన స్పృహను నవీనత కోసం ఎలా మలుచుకున్నాడో, శబ్దాల్నీ, అర్థాల్నీ ఎలా ఆధునికం చేశాడో అర్థమైంది. ఆ పునాది మీదనుంచే మహాప్రస్థానంపై 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' అనే విశ్లేషణ గ్రంథాన్ని ప్రచురించాను. క్రమంగా తెలంగాణా ఉద్యమ కవిత్వమూ (ముఖ్యంగా కుందుర్తి తెలంగాణా, అరుద్ర 'త్వమేవాహం') మిగిలిన సామ్యవాద కవిత్వమూ చదవడం వల్ల మార్క్సిజంపై అభిమానం కలిగింది. అధ్యయనం పెరిగింది. అభ్యుదయ కవులు విస్తరింపచేసిన వచన కవితోద్యమమూ, దిగంబరోద్యమమూ, విప్లవకవిత్వమూ ఒకదాని తర్వాత ఒకటి చైతన్యాన్ని విస్తృతం చేసినై.

1970ల నుంచి విప్లవకవులు 'రివల్యూషనరీ రియలిజమ్'ను వ్యాప్తి చేశారు. అనేక గ్రంథాలు రాశారు. అంతేకాక ఆరోజుల్లో పాశ్చాత్య గ్రంథాలు, సామ్యవాద గ్రంథాలు అన్నీ బాగా అందుబాటులోకి వచ్చినై. చాలా పుస్తకాలు చదివాను. వాటితోపాటు కేవలం కవితా విశ్లేషణకు సంబంధించిన అనేక గ్రంథాలు పఠించాను. సామ్యవాద గ్రంథాలు మార్క్సిస్టు చైతన్యాన్నిస్తే, పాశ్చాత్య విమర్శ ఎన్నో కొత్త అభివ్యక్తి మార్గాల పరిజ్ఞానాన్ని అందించింది.

నేను ముఖ్యంగా సాహిత్యంలోంచి సామ్యవాద చైతన్యంలోకి వచ్చిన వాణ్ణి. అందుకే ఎంతగా విప్లవ సాహిత్యాన్ని అభిమానించినా, కవిత్వంలోగాని, విమర్శలోగాని, పత్రికల్లోగాని, సృజనాత్మక విస్తృతికి సంబంధించిన అంశాలేమీ లేకపోవడం, పైగా వాటన్నిటినీ అప్రధానంగా భావించడం, బాగా అసంతృప్తి కలిగించింది. తర్వాత అనేక అస్తిత్వ ఉద్యమాలు వచ్చినై. వాటన్నిటినీ అధ్యయనం చేసినా, నా ప్రగతిశీల నేపథ్యంతో అనేక వ్యాసాలు రాశాను.

ఇంతలో 1990ల నుంచి ప్రపంచానికే ఉపద్రవం కలిగించే ప్రపంచీకరణ పెనుభూతం భారతదేశంపై తన కోరలు చాచింది. ఇప్పటి సాహిత్యావగాహనకూడా చాలా విస్తృతం కావలసిన అవసరం ఏర్పడింది. కేవలం రాజకీయ అధ్యయనమే చాలదు. సాంస్కృతికావగాహన అత్యంత ఆవశ్యం. కులమత సామాజిక సమస్యలన్నీ పరిగణనలోకి రావాలి. వ్యక్తిగతమైన చైతన్యం కూడా అపరిమితం కావాలి. ప్రపంచీకరణ గురించి అనేక గ్రంథాలు చదివాను. అన్ని మార్క్సిస్టు శాఖల వారినీ చదివాను. ముఖ్యంగా ప్రజాశక్తి ప్రచురణలను పఠించడం వల్ల పరిజ్ఞానం ఎంతగానో విస్తరించింది.

రచయితలు, తమపై పుస్తకాల ప్రభావం గురించి చెప్తారుగాని, నిజంగా ప్రభావం చేసేది, వారి జీవిత పుస్తకమే. తమ జీవిత చైతన్యాన్నే, తాము చదివే గ్రంథాల్లోంచి విస్తృత పరుచుకుంటారు. రచయితకి జీవితమూ, పుస్తకమూ వేరువేరు కాదు. అలాగే నా జీవిత పుస్తకం, నా పుస్తక జీవితంతో నిరంతరంగా ముడిపడివుంది.

★

ఇప్పుడు 'మనం మనం కాదు

తరచుగా,
జీవించడాన్ని మరచిపోతుంటాం మనం...
కాసులవెంటా కలలవెంటా పరుగెడుతూ,
భారంగా బతుకీడుస్తుంటాం.

గ్లిజరిన్ కన్నీళ్లు,
ప్లాస్టిక్ చిరునవ్వులూ,
అద్భుతమైన నటులమైపోతుంటాం అప్పడప్పడూ.
ఈ బింబం మనదికాదు
యంత్ర ప్రపంచం మన ముఖాలకు తొడిగిన అందమైన ముసుగు.

ఆత్మీయుల పలకరింపుల్లోనూ,
ఆర్థిక లావాదేవీల పలుకురాళ్లు.
గాఢాలింగనాలలో సహితం అంతస్తుల తారతమ్యాలు
రూపుదాల్చిన బ్యాలెన్స్ 'షీట్'లమైపోతుంటాం అప్పడప్పడూ
ఈ అలవాట్లు మనవి కావు
నాగరిక లోకం నేర్పిన బహుచక్కని గ్లోబల్ పాఠాలు.

స్వేద ధారలంటే ఏవగింపు
కమ్మని మట్టి పరిమళమంటే ఈసడింపు.
కాయలుకాచిన నల్లని దేహఛాయంటే కంటగింపు.
ఈ భావవ్యక్తీకరణలు మనవి కావు
దట్టంగా కమ్ముకున్న వినిమయ సంస్కృతీ మైకపుపొరలు

ఇప్పడు మనం మనం కాదు
ప్రపంచీకరణ నేర్పుగా పన్నిన ఉచ్చులో చిక్కిన 'గువ్వపిట్టలం'
రంగుల కలల కొక్కెనికి తలక్రిందులుగా వేలాడుతున్న చేపపిల్లలం
పరచుకున్న మార్కెట్ మాయాజాలపు సాలెగూటిలో చిక్కి, సతమతమౌతోన్న అచ్చమైన వినియోగదారులం.

- ఆర్.డబ్ల్యూ.జె.విజయ్య కుమార్

స్వీకరించాక...

బంగారం దుకాణం వాడంటాడు
ఆభరణాల వ్యాకరణంలో
'శుద్ధం' అనే శబ్దం వ్యర్థమని
ఎలాంటి ఆభరణం చేయాలన్నా
కాసింత కల్తీ చేయక తప్పదని!
మేమూ అనుకుంటాం
శుద్ధ బంగారం తీసుకుని ఏం చేయాలి?
మాకు ఒక నగ మాత్రమే కావాలి
సృజనశీలత కలిగిన ఆభరణం కావాలి
బంగారం రాగిని స్వీకరించింది
ఇంకా స్వీకరిస్తూనే ఉంది...

అయితే
ఆభరణాన్ని ఉపయోగిస్తూ పొయినట్టల్లా
మధ్యమధ్యన రాగి తొంగి చూడసాగింది
మేము అనుకున్నాం 'పోనీలే!
ఏదేమైనా ఆభరణమే కదా!' అని
బంగారం సావకాశంగా సమసిపోసాగింది
ఇప్పడు కేవలం రాగే మిగిలిపోయింది
బంగారం దుకాణం వాడంటాడు
బంగారం దుకాణంలో 'రాగికేం విలువా?' అని
ఇప్పడు మేము రాగినే ఆభరణంగా భ్రమించి
అలంకరించుకుంటూ ఉన్నాం!
ఆభరణంలో బంగారం వెదుకుతూ
బాధపడుతూనే ఉన్నాం!

పంజాబీ మూలం: శ్రీమతి పాల్‌కౌర్

తెలుగు : రంగనాథ రామచంద్రరావు



జగమే మాయ నుంచి మాయ జగం వరకూ...

ప్రేమ కథల పరిణామం...

‘యుగానికొకరు ఈ యుగాన మీరు, ఏ యుగాలనైనా ప్రణయ కథలూ ఒకటే, ముగింపు విషాదమే’ అంటూ సాగుతుంది ‘ప్రేమ మందిరం’ చిత్రంలో దాసరి పాట. ఈ చిత్రంలో కథానాయకుడు అక్కినేని. ‘ప్రేమ నగర్’తో ఘన విజయం సాధించిన రామానాయుడే నిర్మాత. వాణిశ్రీ తప్ప చాలా మంది అప్పటి ప్రముఖులు వున్నారు. కాని ఆ చిత్రం జయప్రదం కాలేదు.

‘తల్లిదండ్రులను ఎదిరించి కోరుకున్న అమ్మాయిని పెళ్లాడిన హీరోను గొప్ప ఆదర్శంగా చూపించడం ఒకప్పటి చిత్రాల్లో సాధ్యమై వుండొచ్చు. కాని ఇప్పుడు కాదు” అని కొడవటిగంటి కుటుంబరావు డెబ్బయ్యవ దశకంలో రాశారు.కాని ఆయన రాసిన తర్వాత నలభై ఏళ్లకు కూడా ప్రేమ కథలు ఆగిపోలేదు. ఇప్పుడు కూడా ఆడుతూనే వున్నాయి. ప్రేమికులు మారొచ్చు గాని ప్రేమ శాశ్వతం అన్నట్టే ప్రేమకథలు మారొచ్చు గాని ప్రేమ సినిమాలు ఆగవు. ఎందుకంటే అది ..మౌలిక భావోద్వేగాలలో భాగం కనుక. అయితే మరో వైపు నుంచి చూస్తే అక్కినేని ‘దేవదాసు’ కాలం నుంచి దాదాపు అరవై ఏళ్లలోనూ ప్రేమ కథా చిత్రాలు చాలా మార్పులకు లోనవుతూనే వున్నాయి. ఆ మార్పులన్ని ప్రేమావరణానికి అంటే సామాజిక ఆవరణానికి సంబంధించినవే.

‘లైలామజ్నూ, దేవదాసు’ రెండు చిత్రాల్లోనూ ఇతివృత్తం ఒక్కటే.కొద్దిపాటి తేడాతో ‘అనార్కలి’ కూడా. ధనవంతులైన తలిదండ్రులు పేదవాళ్లతో వియ్యం అందడానికి నిరాకరించడం. ఈ మూడింటిలో హీరో కూడా ఒక్కడే. ఇందులో ఒకటి అరేబియన్ కథ, మరోటి తెలుగు రూపం తీసుకున్న బెంగాలీ కథ. మరోటి కూడా తెలుగులో వచ్చిన భారతీయ ముస్లిం చక్రవర్తుల ప్రేమ కథ. ప్రేమ విశ్వజనీనతకు ఇక్కడే ఆధారం కనిపిస్తుంది. వీటి ముగింపు కూడా చాలా వరకూ విషాదాంతమే. అందుకే దాసరి అలా అన్నారు.

సినిమా అన్నాక నాటకీయత వుండాలి. దేన్నయినా తేలిగ్గా జరిగిపోయినట్టు చూపిస్తే మజా వుండదు. కనక ప్రేమకు అవరోధాలు ఎదురవ్వాలి. వాటిని వినోదంగా పరిష్కరించుకోవడమో వినూత్నంగా అధిగమించడమో లేక విషాదంగా ముగిసిపోవడమో జరగాలి. తప్పదు. మొదట చెప్పుకున్న యాభయ్యవ దశకపు కథలన్ని ఎక్కువ భాగం కోరుకున్నవారిని చేసుకోలేకపోవడంపై నడిచాయి. ‘దేవదాసు’ తర్వాత వినోదా వారే తీసిన ‘చిరంజీవులు’ (ఎన్టీఆర్, జమున), భరణీ వారు వితంతు సమస్య కలిపి తీసిన ‘బాటసారి’(అక్కినేని, భానుమతి) వంటివి ఈ కోవలో చెప్పుకోవచ్చు. ‘వెలుగు నీడలు, మనుషులు-మమతలు, మనసే మందిరం’ తదితర చిత్రాలు కూడా ఇదే తరహాలో అక్కినేని సావిత్రి ప్రేమించి పెళ్లి చేసుకోకపోవడం చుట్టూ తిరుగుతాయి. (డాక్టర్ చక్రవర్తిలో మాత్రం కృష్ణకుమారి). ‘ఆరాధన, చదువుకున్న అమ్మాయిలు’ వంటివి మరో తరహా. ప్రేమను త్యాగం చేయడం ఇంకో ఫార్ములా. ప్రేమించి చేసుకున్నాక సమస్యలు రావడదం అక్కినేని, సావిత్రి ‘సుమంగళి’. ఆ విధంగానే అక్కినేని అంటే త్యాగమూర్తి అన్న బిరుదు లభించింది. సావిత్రి ఆయనతో పోటీ పడింది. తర్వాత వాణిశ్రీ వచ్చింది. ‘దసరా బుల్లోడు’తో త్రికోణ ప్రేమ మొదలైంది.. ఇలాంటివి కొన్ని తర్వాత శోభన్ బాబు, కృష్ణ కూడా చేశారు గాని ప్రధానంగా అది అక్కినేని బ్రాండే. అందుకే ఆయన వయస్సు పెరిగాక కూడా జంధ్యాల ‘అమరదీపం’, దాసరి ‘రాగదీపం’ వంటి చిత్రాల్లో ఈ ఫార్ములాలో జరిగిన విఫలయత్నాలే. అయితే ఆదే ప్రేమ, త్యాగం ఫార్ములాను కాస్త మార్చి తీసిన ‘ప్రేమాభిషేకం’ బాక్సాఫీసు బద్దలు కొట్టింది. శోభన్ బాబు, శ్రీదేవి, జయప్రదల ‘దేవత’ కూడా పెద్ద విజయం.

80 వ దశకంలో ఈ తరహా కథలు బాగా తగ్గుముఖం పట్టడానికి అనేక కారణాలున్నాయి కాని విషాదాన్ని భరించలేక పోవడం ప్రధానమైంది. చాలా ప్రేమ కథలు తమాషా తరహాలో వచ్చాయి. బరువైన కథలు తక్కువగానే వచ్చాయి. మరోవైపున లేబ్రాయపు ప్రేమ పేరుతో ప్రేమికుల వయస్సును బాగా తగ్గించేసే ప్రక్రియ మొదలైంది. జంధ్యాల ‘ముద్దమందారం’ తెలుగులో ఇందుకు ప్రేరణ. హిందీలో ‘జవానీ దివానీ, రఫూ చక్కర్, బాబీ, లవ్‌స్టోరీ’ వంటివన్నీ ఇందుకు స్ఫూర్తి. తెలుగులోనూ ‘తాజ్‌మహల్, ప్రేమఖైదీ, ప్రేమ (వెంకటేష్)’ వంటి చిత్రాలొచ్చాయి.

ఎప్పుడైనా వట్టి ప్రేమ ఒక్కటే కథలను నడిపించదు. ప్రేమ ప్లస్ త్యాగాలు, కుటుంబ సమస్యలు, లేదా అనారోగ్యాలు, లేదా ప్రకృతి వైపరీత్యాలూ లేదా అసూయపరుల కుట్రలు, అపార్థాలు ఏవో వుండాలి. తొంభయ్యవ దశకం తర్వాత ప్రేమ కథల్లో ఈ మార్పు ప్రస్ఫుటమైంది. అప్పటికి ప్రపంచీకరణ ప్రభావం ప్రసరిస్తున్నది. ప్రేమకు తోడు ఫాక్షనిజం వంటివి కలిపే ప్రక్రియ మొదలైంది. వెంకీ ‘ప్రేమించుకుందాం రా’ దానికి మొదలు. అది కొన్నాళ్లు నడిచింది. ఇంకా నడుస్తున్నది. 2000 తర్వాత ‘నువ్వు- నేను’ తరహా ప్రేమకథలు పుంజుకున్నాయి. ‘నువ్వే కావాలి, నువ్వునేను, నువ్వు నాకు నచ్చావ్, మనసంతా నువ్వే, జయం’ వంటి చిత్రాలు కొత్త వరవడి తీసుకొచ్చాయి. వీటి ద్వారా తరుణ్, ఉదయకిరణ్, వంటి కొత్త హీరోలు కూడా రాగా మరోవైపున వెంకీ, శ్రీకాంత్, చక్రవర్తి వంటి పాత హీరోలు కూడా కొనసాగారు. మొత్తంపైన మారిన సామాజిక వాతావరణాన్ని ఈ చిత్రాలు చూపించాయి.

వారసులుగా హంగామాతో రంగ ప్రవేశం చేసిన జూనియర్ ఎన్టీఆర్, అల్లుఅర్జున్, రాంచరణ్ తేజ, ప్రభాస్ వంటివారిని ఒక్క మూసలో కుదించలేము. వీరు వచ్చిన కొద్ది అది వరకటి కుర్ర హీరోలు అదృశ్యమై పోవడమూ అనివార్యంగా జరిగింది. ఇలాంటి వారి చిత్రాల్లో అనేక ఇతర అంశాలతో పాటు ప్రేమ కూడా వుంటుంది. కాకపోతే ఈ క్రమంలో నాయిక ప్రాధాన్యత బాగా తగ్గింది. ఈ జాబితాలో అల్లు అర్జున్ మాత్రం ఎక్కువ ప్రేమ ఇతివృత్తాలు తీసుకుంటాడు. ‘ఆర్య, హేపీ’ వంటి చిత్రాల్లో దాన్ని వింత వింత మలుపులతో చూపించాడు. ఇందులో త్యాగాలు, బాధలు తక్కువ. కామెడీ బాగా ఎక్కువ. అయితే ఈ ప్రేమ ప్లస్ చిత్రాలకు రకరకాల మసాలాలు. ముఖ్యమైంది విలన్లను అంటే మాఫియా డాన్లను వింత వింత పద్ధతుల్లో చిత్తు చేయడం. అన్నిటినీ ఒకే వ్యాసంలో పరిశీలించడం ఒకింత కష్టమే. మొత్తంపైన ‘దేవదాసు’ నాటి ‘జగమే మాయ’ ప్రేమ పోయి మాయ జగం ప్రేమకథలు ఇప్పుడు నడుస్తున్నాయి. నిరాశావాదం మాయమవడం చాలా మంచి పరిణామమే కాని అప్పటి మానవీయ విలువలు కొన్ని లుప్తమై ఆషామాషీ ధోరణులు పెరగడం ఆహ్వానించదగింది కాదు. క్లుప్తంలో ఇదీ మనప్రేమ కథల కథ!

- తెర

కథ

నీ కోసమే జీవించునదీ...

ఇవాళ ఏ చానల్ పెట్టినా ఏ పేపర్ చూసినా ఒకటే. ప్రేమ...ప్రేమ...ప్రేమ గురించిన అవే కబుర్లు అనంతంగా ప్రవహిస్తుంటాయి. కొద్దిగా ఆలోచిస్తే... నిజమైన ప్రేమ ఎలా వుంటుంది? నిజమైన ప్రేమికులకు రూపం వస్తే ఎలా వుంటారు? వారు ఒకరికోసం ఒకరు ఎంతగా ఆరాటపడతారు? తపిస్తారు? అసలు అలాంటివారు ఈ భూమ్మీద పుట్టారా? అనిపిస్తుంది. అలాంటి నిజమైన అపురూప ప్రేమకథ ఒకటి మీ ముందుంచుతున్నాం. ఇది ఇప్పటికే తెల్సినవాళ్లయితే మరోసారి గుర్తుచేసుకోండి. తొలిసారి చదువుతుంటే మాత్రం మనసులో పదిలపర్చుకోండి.

జెన్నీ తండ్రి లుడ్విగ్ వాన్‌వెస్ట్ ఫాలెన్. ఆయన ప్రీవీకౌన్సిలర్. కాని లుడ్విగ్‌కు కులీన కుటుంబపు అభిజాత్యం లేదు. ఉదార భావాల నిలయం ఆయన. తల్లి ఒక అధికారవర్గ కుటుంబపు ఆడపడుచు. జెన్నీ సోదరుడు ఎడ్గార్. మార్క్స్ సహపాఠి. వారి సాన్నిహిత్యం ఫలితంగానే మార్క్స్‌కు, జెన్నీకి బాల్యస్నేహం ఏర్పడింది. కాలం గడిచేకొద్దీ అది అనురాగ బంధమైంది. మార్క్స్ తండ్రి హెయిన్‌రిచ్ మార్క్స్ విజ్ఞాని. అడ్వొకేటు. ఆర్థిక అంతస్థులలో రెండు కుటుంబాలకు ఎంతో దూరం. కాని పరస్పర అవగాహనతో సన్నిహితమైనాయి. మార్క్స్ ఉద్రేకి. భావకుడు. అసమాన మేధావి. వినూత్న వ్యక్తిత్వం ఆయనది. జెన్నీ సౌందర్యాలగని. బాలె నృత్యంలో అసమాన ప్రజ్ఞ ఆమెది. ఎందరో ఆమె అభిమానానికి అర్రులు చాచేవారు. ఏ కులీన కుటుంబమైనా ఆనందంగా ఆమెను కోడలిగా ఆహ్వానించేది. కాని ఆమె మార్క్స్‌కు ఒక సాధారణ కుటుంబీకునికి తన హృదయం అర్పించింది. జీవిత భాగస్వాములు కావాలనుకున్న వారి బాసలు ఏడేండ్లపాటు రహస్యంగా వుంచవలసి వచ్చింది. ఈ వివాహ ప్రతిపాదనకు ఎన్నో అవరోధాలు ఎదురైనాయి. ఆమె తన బంధు వర్గాన్నంతా ప్రతిఘటించాల్సి వచ్చింది.

తమ అనురాగ సాఫల్యానికి ఏడేండ్లు ఎదురుచూస్తూ ప్రేమపూజారి అయినాడు మార్క్స్. అందరి యువకులలాగే ప్రేమగీతాలు ఆలపించాడు. మార్క్స్‌లోని మేధావి ఆమెను ఆకర్షించాడు. ఆయన భావాలను ఆరాధించింది ఆమె. ఆయన సాంస్కృతిక జీవన విలువలు, ఆలోచనలు ఆమెను ప్రభావితం చేశాయి. మార్క్స్ శక్తి సామర్థ్యాలను, మేధా సంపత్తిని అందరికన్నా ముందు గ్రహించింది ఆమె. ఆమెలోని అంతఃసౌందర్యాన్ని ఆరాధించాడాయన. ఆమె మేధస్సూ ఆరాధ్యమైంది. 'అక్షర ప్రపంచం'లో ప్రాజ్ఞురాలు ఆమె. కళారంగంలో ఆమె విజ్ఞత ప్రత్యేక బాణీగా తోచింది ఆయనకు. అవే ఆయన ఆమెకు నీరాజనం పట్టేందుకు కారణమైనాయి.

మార్క్స్ చదువులు ముగించాడు. డాక్టరేటు పొందాడు. కాని ప్రష్యాలో రాజుకు తలెత్తుతున్న పారిశ్రామిక పెట్టుబడికి ఘర్షణ ప్రారంభమైంది. పెరుగుతున్న ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాన్ని అణచేందుకు సిద్ధాంత రంగంలో సహితం రాచరికం దాడి ప్రారంభించింది. తన చుట్టూ సాగుతున్న పోరాటంలో అంతర్భాగమైనారు మార్క్స్. ఆ పోరాటం జర్మనీలో సాగించడం అసాధ్యం. అందుకే పారిస్‌ను తన కార్యస్థానంగా ఎంచుకున్నారు. కాని ఇవన్నీ పథకాలే. కుటుంబాన్ని పోషించే సంపదలు లేవు. అందుకే వారి వివాహం మరికొంతకాలం వాయిదా పడింది. బాధల నీడలు అప్పుడే పరుచుకుంటున్నాయి. మార్క్స్ సైద్ధాంతిక పోరాటం సాగిస్తున్నాడు. ఇబ్బందులు ఎదురౌతున్నాయి. అప్పుడు రాసింది జెన్నీ ఆయనకొక ఉత్తరం.

"ఎంత ఆకర్షణీయంగా, అద్భుతంగా, విజయవంతంగా నీ మూర్తి నాముందు నిలుస్తోంది. నీ శాశ్వత సాన్నిహిత్యం కోసం నా హృదయం ఎలా ఆక్రోశిస్తోంది? ఎంత ఆతృతతో నీ గమనాన్ని అనుసరిస్తోంది నా ఎద? నీవు ఎటకేగినా అనుసరిస్తున్నా నేను. నీకై ముందడుగు వేస్తున్నా. నీవెంటే అంటకాగుతున్నా. నీ దారిని శుభ్రపరచి, నీ గమనం సుగమం చేసి, నీ పయనానికి సిద్ధం చేయగలిగితే, నీ మార్గాన గల అన్ని అడ్డంకులను తొలగించే మహాశక్తి నాకు కలిగితే ఎంత బాగుండును?"

1843 జూన్ 19. ఏడేండ్లు ఎదురుచూచిన ఆ హృదయాలు వివాహబంధంతో పెనవేసుకున్నాయి. "తలమునకలైన" ప్రేమ ఫలించింది. వెంటనే ప్రభుత్వ గూఢచారి శాఖ అధిపతి ప్రత్యక్షమైనాడు. ప్రభుత్వ ఉద్యోగం ఎరచూపాడు. కాని దాంపత్య జీవితంలో అప్పుడే అడుగిడిన ఆ జంట ఉద్యోగమిచ్చే సుఖాన్ని నిరసించింది, కాలదన్నింది. మార్క్స్ - జెన్నీలు పారిస్ చేరారు. రాజకీయ ప్రవాసితులు ఎదుర్కొనే బాధలు, చేయవలసిన త్యాగమూ స్వాగతం చెప్పాయి వారికి. అయినా ప్రేమించి, ఆరాధించి, భావ సమైక్యతగల భార్య చెంతనుండగా యివన్నీ లెక్కకాదు గదా!

మార్క్స్ ఆర్థికంగా నిరుపేద. భార్య గర్భవతి. ఆ సమయంలో రైన్ లేండ్‌లోని స్నేహితులు ఆదుకుని గట్టెక్కించారు. స్వదేశంలో ఫ్యూడల్ వ్యతిరేక మహోద్యమం సాగుతోంది. దాని లోతుపాతులు మార్క్స్ ఎంతో ప్రజ్ఞాప్రాభావాలతో వివరించేవాడు. అందువల్లనే కమ్యూనిస్టులేగాక నిజమైన ప్రజాతంత్రవాదులంతా ఆయనచుట్టూ సమీకృతులయ్యేవారు. నూతన దంపతులకు అందిన కొద్దిపాటి ధనం వారొక పర్సులో పెట్టి బయటే వుంచేవారు. ప్రవాసితులు ఎవరైనా తమ అవసరాలకు దానిని వాడుకునేవారు. అంతటి అర్ద్రత ప్రకటించేది జెన్నీ. పారిస్‌లో వారి ఇల్లు చాలా చిన్నది. అయినా ఈ రాజకీయ కార్యకర్తలంతా అక్కడ చేరేవారు. జెన్నీ ఆదరణ, అభిమానం, వారిపట్ల ఆమె చూపే అనురాగం ఆ ఇంటిని ఒక రాజకీయ కేంద్రంగా మార్చాయి. కాని ప్రష్యన్ ప్రభుత్వం వారి కార్యకలాపాలను ఒక కంట కనిపెడుతూనే వుంది. ఫ్రెంచి ప్రభుత్వంపై వత్తిడి తెచ్చింది. ఫలితంగా ఫ్రాన్స్ వదిలిపోవాలని మార్క్స్‌ను ఆదేశించారు. ఫ్రాన్స్ వదిలి బ్రసెల్స్ చేరారు మార్క్స్. 1845లో లారా, 1846లో కుమారుడు ఎడ్గార్ పుట్టడంతో కుటుంబం పెరిగింది. దరిద్రం ఒకవైపు, పోలీస్ దౌర్జన్యాలు మరోవైపు వేధిస్తున్నా మార్క్స్ కుటుంబం మాత్రం సడలని ధైర్యంతో తమ ఉద్యమం కొనసాగించింది. వారి కుటుంబ జీవితం సంతోషంగానూ, సజీవంగానూ సాగింది.

1848 ఫిబ్రవరి చివరినాటికి కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురణ ప్రారంభమైంది.... విప్లవకారుల విశ్వకుటుంబం ఆనందోత్సాహాలతో వెల్లివిరిసింది. వీటి మధ్యనే విప్లవ కార్యాచరణ ప్రారంభమైంది. కానీ మార్క్స్ కుటుంబం దుర్భర దారిద్ర్యంతో వేగిపోతున్నది. ప్రవాసితులకు ఆ ఇల్లు అతిథి గృహమై వారి బాధను మరింత బాధాకరం చేస్తున్నది. అటువంటి స్థితిలో మార్క్స్ తండ్రి మరణించారు. ఆయన ఆస్తికి వారసుడైన మార్క్స్‌కు కొంత అందింది. విప్లవకారుడు మార్క్స్ సహచరి జెన్నీ. ఆ సంపద తమ కుటుంబానికి కలిగించగల భద్రతను, ఇవ్వగల సౌఖ్యాన్ని కాదని విప్లవకారుల ఆయుధాలకు తమవద్దనున్న సొమ్మును విరాళంగా ఇచ్చారు. వారి ఆదర్శం అది. యూరప్‌లో ప్రజా తిరుగుబాట్లు జయప్రదమైనవి. వీటిలో మార్క్స్ పాత్ర ఎంతో ఆదరణకు గురైంది. ఆ ఆదరణ ఫలితంగానే ఫ్రెంచి తిరుగుబాటుదారులు ఆ దంపతులను తిరిగి ఫ్రాన్స్‌కు ఆహ్వానించారు. ఒకవైపు స్వేచ్ఛా ఫ్రాన్స్ ఆహ్వానం అందింది. మరుక్షణమే బెల్జియం పోలీసులు వచ్చి 24 గంటలలోగా దేశం వదిలి వెళ్ళాలని ఆదేశించారు. గడువు తీరకముందే పదిమంది పోలీసులతో కలిసి ఒక కమీషనర్ ఇంట్లో జొరబడి ఇల్లంతా గాలించి, చిందరవందర చేశారు. నివాసపు కాగితాలు లేవనే నెపంతో మార్క్స్‌ను అరెస్టు చేశారు. వెంటనే జెన్నీ ప్రముఖులను కలిసింది. మార్క్స్ విడుదల కోరింది. ఇంటికి తిరిగి వచ్చేసరికి వాకిట్లోనే పోలీసు ఎదురైనాడు. మార్క్స్‌తో మాట్లాడదలచుకుంటే తనతో రమ్మని

అడిగాడు. ఆ ఆహ్వానాన్ని ఆమె సంతోషంగా అంగీకరించి బయలుదేరింది. ఆమెను పోలీసులు తమ కార్యాలయానికి తీసుకువెళ్ళారు. అక్కడ మార్క్స్ లేడు. పోలీసు అధికారి జెన్నీని "నీవు ఎవరు? నీ నివాసపు కాగితాలు ఎక్కడ?" అని దబాయించాడు. వేధించసాగాడు. అవి ఆమె దగ్గరలేవు. "నీవు తిరుగుబోతువు" అని ఆరోపించాడు. ఆ ఆరోపణపైనే ఆమెను అరెస్టు చేశారు. ఆమెను సిటీ కౌన్సిల్ జైలుకు తరలించారు. ఆ రాత్రి వ్యభిచారులతో కలిపి ఒక చీకటి కొట్లో ఆమెను బంధించారు. "నీవు రాచపుట్టుక పుట్టావు, కులీన కుటుంబంలో జన్మించావు. ప్రజాస్వామ్యం పేరిట చెలరేగుతున్న అలగాజనంతో, అల్లరిమూకలతో చేరుతున్నావా? సిగ్గులేదూ? అది నేరం కాదూ?" అంటూ ఆ న్యాయమూర్తి చాలా వెగటుగా మాట్లాడాడు. చివరికి ఆమెను వదిలిపెట్టారు. కాని అప్పటికే యిచ్చిన 24 గంటల గడువు దాటిపోయింది. కనీసం కట్టుబట్టలు కూడా తీసుకోకుండా వారు పారిస్‌కు పయనమైపోయారు.

యూరప్‌లో విప్లవం వెనుకడుగు వేసింది. ప్రజా విజయంపై భ్రమలు పెంచుకున్న నాయకత్వం ఆ విజయాలను స్థిరపరచుకొనడంలో ఏమరపాటు ప్రదర్శించింది. దాని ఫలితంగా విప్లవ వ్యతిరేక శక్తులు పైచేయి సంపాదించినవి. "న్యూ రేనిష్ గెజిట్" పత్రిక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నది. పత్రికకు అప్పులు ఎక్కువయ్యాయి. తనకుగల వారసత్వపు మిగతా ఆస్తినంతా వెచ్చించి మార్క్స్ ఆ అప్పులు తీర్చవలసివచ్చింది. విప్లవ వ్యతిరేక శక్తులు మార్క్స్‌ను వేటాడడం ప్రారంభించాయి. పత్రిక నడపడం అసాధ్యమైంది. మార్క్స్, ఎంగెల్స్‌లు జర్మనీలో ఒక మూలకుపోయి ప్రవాసజీవితం గడపాలనుకున్నారు. ఏదో ఒక నీడ దొరికేవరకు ట్రైయర్‌లో జెన్నీ తల్లివద్ద వుండడం జెన్నీకి, పిల్లలకు మంచిదని ఆ ఇద్దరూ భావించారు. కాని ప్రయాణానికి డబ్బులేదు. తమ వద్ద మిగిలి వున్న వెండి సామాను కుదువపెట్టారు. తక్షణావసరాలకు వాడుకున్నారు. జర్మనీలో తుదిపోరాటం సహితం విఫలమవటంవల్ల మార్క్స్ పారిస్‌కు వచ్చారు. జెన్నీ, పిల్లలుగూడా పారిస్ చేరారు. రూడే లిల్లీ అనే ఒక ప్రాంతంలో చిన్న ఇల్లు తీసుకున్నారు. ఇంకా ఇల్లు చక్కదిద్దుకోక ముందే ప్రభుత్వ ఉత్తర్వుతో పోలీసు అధికారి ప్రత్యక్షమైనాడు.మార్క్స్ పారిస్ వదిలి తేమగా వుండే బ్రిటానీ జిల్లాలో మాత్రమే వుండాలి. అప్పటికే వారి పిల్లలు వ్యాధిగ్రస్తులు కావడం ప్రారంభమైంది. ఆ జిల్లాలో కాపురం అంటే పిల్లలను వారి మృత్యువుకు ఒప్పచెప్పడమే. ఇది హత్యకు అజ్ఞాత ప్రయత్నం అని అభివర్ణించారు మార్క్స్. అందుకే వారు ఆ దేశం వదలడమే మార్గమనుకున్నారు. కాని డబ్బులేదు. ఎక్కడికి వెళ్ళాలనేది కూడా ప్రశ్నే. తుదకు వారు లండన్ ప్రవాస జీవితాన్ని ఎన్నుకున్నారు. ప్రయాణానికి అక్కడక్కడా డబ్బు అడిగి పని జరుపుకోవలసి వచ్చింది. అలా సంపాయించిన ఆ డబ్బు కూడా కుటుంబం అంతా ప్రయాణం చేయటానికి చాలదు. అందువల్ల మార్క్స్ ఒక్కడే లండన్‌కు ప్రయాణమై వెళ్ళారు. లండన్ చేరేసరికి పరిస్థితులు మరీ ఘోరంగా వున్నాయి. వివిధ దేశాల ప్రభుత్వాలు విప్లవకారులను వేటాడుతున్నారు. ఆ ప్రమాదం నుండి రక్షించుకునేందుకు విప్లవకారులంతా లండన్ చేరుకోసాగారు. వారిని దుర్భర దారిద్ర్యం, ఆకలి, మృత్యువు వెంబడించసాగాయి. ఆ స్థితిలో మార్క్స్, ఎంగెల్స్‌లు వారిని ఆదుకునేందుకు వారికోసం సహాయక కమిటీలను ఏర్పర్చి వాటికి ఆధ్వర్యం వహించారు. ఎలాగైతేనేం గర్భవతి జెన్నీ, ముగ్గురు పిల్లలు లండన్ చేరారు. బాధలు మరింత ఎక్కువైనాయి. అలాంటి సమయంలో ఏంగెల్స్ వారికి అండగా వచ్చారు. ప్రతినెలా కొంత డబ్బు పంపే ఏర్పాటు చేశారు. ఆ విధంగా ఈ యిబ్బందులు ఒక మేరకు తగ్గాయి. రోజువారీ ఇబ్బందుల నుండి మార్క్స్ దృష్టిని మరల్చి, సిద్ధాంత నిర్ణయాలు చేసేందుకు అనువైన ప్రశాంత వాతావరణం జెన్నీ కల్పించేది. ఆమె మార్క్స్‌కు సలహాదారు, కార్యదర్శి. ఆయన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆమె చూసేది. మార్క్స్ చేతిరాత బాగుండేదికాదు. దానిని ఆమె మాత్రమే సక్రమంగా చదవగలిగేది. తన ప్రతి సిద్ధాంత నిర్ధారణను ఆమెతో చర్చించేవాడు మార్క్స్. ఆమె అంతటి మేధావి. ఆయన రచనలన్నింటినీ ఆమె అచ్చుకు అనువుగా తీర్చిదిద్దినట్లు రాసేది.

సరయిన పోషణలేక పిల్లలు ఇంగ్లాండు వాతావరణానికి జబ్బుపడ్డారు. తుదకు సంవత్సరం నిండిన హెన్‌రిచ్ గ్రయిడో 1890 నవంబరు 19న ప్రాణాలే విడిచాడు. "నా ప్రాణం విలవిలమంటున్నది. నే పోగొట్టుకున్న మొదటి బిడ్డ వీడు ఓ! మరెన్ని కష్టాల కడలులు మేము గడపాల్సి వుందో! వాటికి అంచనాలేదు. మేము ఎదుర్కొన్న బాధలతో పోలిస్తే ఏ యిబ్బంది అయినా నిర్లక్ష్యంచేయదగిందే" అని రాసింది ఆమె. మొదటి బిడ్డ మరణం మనసు నుండి తొలగనేలేదు. ఆనాటి కన్నీటి చారలింకా మాయనేలేదు. మరో ఏడాదిన్నరకు చిన్న కూతురు ఫ్రాంజిస్కా విగతజీవి అయింది. ఆ తల్లి దుఃఖానికి అవధులు లేవు. ఫ్రాంజిస్కా మరణించి మూడేళ్ళు కాలేదు. ఆ బాధ నుండి ఆ దంపతులు ఇంకా పూర్తిగా తేరుకోనేలేదు. ఇంతలో ఇంటికంతా వెలుగు, ముద్దులు కురిపించే కొడుకు ఎడ్గార్ మరణించాడు. మరోవైపు మార్క్స్‌పై అభివృద్ధి నిరోధకుల నీచ నిందారోపణలు. ఈ నిందలవల్ల జెన్నీ కుంగిపోయింది. ఆ నిందలకు ఆయన సమాధానం రాస్తున్నంత కాలం ఆమె ఉద్విగ్నంగా వుండేది. అలజడి చెందేది. ఆమెకు నిద్రపట్టని వ్యాధి ఇన్‌సామేనియా పదేపదే సోకింది. ఆ కరపత్రం అచ్చుకు సిద్ధం చేసేందుకు ఆమె కూడా రాత్రింబవళ్ళు కృషి చేసింది. అది పూర్తి అయ్యే నాటికి ఆమె మంచమెక్కింది. ఆ జబ్బు మసూచిగా మారింది. వారాల తరబడి ఆమె మంచాన పడి వుండవలసి వచ్చింది.

"చివరకు నా శరీరమే జయించింది. మార్క్స్ ప్రేమాస్పదమైన సేవలు నన్ను రక్షించాయి. ఇప్పటికి లేచి కూర్చోగల్గుతున్నాను. నేను కోలుకుంటున్నాను. నా ముఖం మాత్రం వికృతమైంది.... క్రిస్మస్ వరకు పిల్లలు మా వద్దకు రాలేదు. పిల్లలు దగ్గరలేకపోవడం ఎంత వెలితో ! తరువాత అందరం కలిసి వుండడం జరిగింది. అది అనిర్వచనీయమైన ఆనందాన్నిచ్చింది అని తర్వాత ఆమె రాసింది.

"నేను పడకనుండి అలా కాస్త లేచి తిరగసాగానో లేదో నా ప్రియమైన కారల్ జబ్బు పడ్డారు. ఆందోళన, బాధ, కష్టాలు ఆయనను వ్యాధిగ్రస్తున్ని చేశాయి. ఆయన కాలేయవ్యాధి మొట్టమొదటిసారి మరింత తీవ్రమైంది. కొన్ని వారాలబాధ తర్వాత ఆయన కోలుకున్నారు. ఆయన వ్యాసాలకు 'ట్రిబ్యూన్' పత్రిక సగం డబ్బే యివ్వసాగింది. పుస్తకం నుండి ఆదాయం రాలేదు సరిగదా ఒక ప్రాంసరీ నోటు వెంటనే చెల్లించాల్సి వచ్చింది. అమానుషమైన ఈ వ్యాధికి పెట్టిన ఖర్చులు తోడైనాయి. గత చలికాలం మా జీవితాలు ఎలా వున్నాయో దీనినిబట్టి ఊహించుకో!" అని రాశారు ఆమె. 1864 సెప్టెంబరు 28. సెయింట్ మార్టిన్ హాలులో శ్రామికజన సభ జరిగింది. దాన్ని అంతర్జాతీయ సంస్థ రూపొందించింది. ఈ సంస్థ నిర్మాణం జెన్నీకి ఎంతో ఆనందాన్నిచ్చింది. "అంతర్జాతీయ సంస్థ ఏర్పడింది. శ్రామికవర్గ పోరాటం దేశదేశాల పురోగమిస్తోంది. ఆ మహాప్రస్థానపు అగ్రభాగాన ఆమె భర్త నడుస్తున్నాడు. ఆమె అనేక ఇబ్బందులు పడింది. ఎన్నో కష్టాలు భరించింది. వాటన్నింటికి పరిహారం లభించే కాలం ఆసన్నమైంది. మార్క్స్‌పై విసిరిన నిందలన్నీ గాలికి పొట్టులా ఎగిరిపోవడం ఆమె జీవితకాలంలోనే చూడగలిగింది" అంటూ ఆమె పొందిన ఆనందాన్ని ఏంగెల్స్ వర్ణించారు.

"ముందు పెద్దగదిలో మా అమ్మ పడుకొని వుంది. వెనుక చిన్నరూములో నాన్న జబ్బులో వున్నారు. ఇద్దరూ జబ్బుతో లేవలేని స్థితిలో వున్నారు. జీవితమంతా కలిసి మెలసి వున్నవారు వారు. ఆ రోజు అలా కలసి కూర్చోలేకపోయారు. ఆనాటి ఉదయం నాకింకా గుర్తు వున్నది. శక్తినంతా కూడదీసుకొని నాన్న అమ్మ మంచం వద్దకు వచ్చారు. ఒకరి కండ్లలోకి ఒకరు చూసుకుంటున్న ఆ దృశ్యం, వారి చూపులలో వ్యక్తమైన ప్రేమ, ఆనందం చూస్తుంటే జబ్బుతో కుములుతున్న ఆయన, ఆమె కడపటి ప్రాణంతో వున్నవారిలా వారు కనిపించలేదు. అప్పుడే నవ వసంతంలోకి అడుగిడుతున్న ప్రేమికుల్లా, యువదంపతుల్లా కనిపించారు" అని చివరి రోజుల గురించి ఎలినార్ రాసింది. 1881 డిసెంబరు 2. జెన్నీ చివరిశ్వాస వదిలింది. ఇది మార్క్స్ ఎన్నటికీ ఎదుర్కొనలేని దెబ్బ. ఆయన వ్యాధిగ్రస్తుడు గనుక శ్మశానానికి సహితం ఆయనను వెళ్ళనీయలేదు.

"మీ తల్లి గుణాలన్నీ, చేతలన్నీ అతి సహజం, నిజం! అందులో కల్మషమూ, నటనాలేదు" అని రాశారు మార్క్స్ ఒక కుమార్తెకు. ఆమె మరణానంతరం ఆయన తన దేహంలో ఒక భాగం కోల్పోయినట్టే అయ్యాడు. ఆయన 1883 మార్చి 14న మరణించాడు.

ఎంగెల్సును అలా వుంచితే మార్క్స్ అనగానే మార్క్సిజం గుర్తుకు వచ్చినట్టే జెన్నీ తప్పక గుర్తుకువస్తారు. నిజమైన ప్రేమ అంటే ఏమిటో నిర్వచనమై నిలుస్తారు.

(జెన్నీమార్క్స్ పుస్తకం నుంచి...) ★

ఆరోగ్యం

ఆ ఆలోచనే వద్దు



ప్రేమలో విఫలమైనప్పుడు, పెద్దలు మెచ్చిన చదువులు చదవలేకపోయినప్పుడు, ఐదారంకెల జీతం అందే ఉద్యోగం ఊడినప్పుడు, భార్యాభర్తల మధ్య సమస్యలు వచ్చినప్పుడు, వ్యవసాయం-వ్యాపారంలో నష్టాలొచ్చి అప్పులపాలైనప్పుడు, పరీక్షల్లో ఫెయిలైనప్పుడు కొందరు తొందరపాటు నిర్ణయం తీసుకుంటారు. ఫలితమే ఆత్మహత్య. ఇటీవలి కాలంలో ఇలాంటి సంఘటనలెన్నో పత్రికల్లో, టీవీలో చూస్తున్నాం.

అసలు ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారు? కారణాలేంటి? ఇందులో కూడా రకాలున్నాయా? ఆత్మహత్యా ప్రయత్నం చేసినవారిపట్ల కుటుంబ సభ్యులు ఎలా ప్రవర్తించాలి? వంటి వివరాలు చూద్దామా!





డా॥ కర్రి రామారెడ్డి
డైరెక్టర్, సైకియాట్రిస్ట్
మానసా హాస్పటల్,
రాజమండ్రి

మనిషి జీవితపు ఆఖరి ఓటమి మరణం అయితే అలాంటి ఓటమిని వ్యక్తిత్వ లోపంతోనో, పరిస్థితుల ప్రభావంతోనో అర్థాంతరంగా ఆహ్వానించడమే 'ఆత్మహత్య'. అటువంటి ఆత్మహత్యకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన నిజాలు పరిశీలిస్తే...

◆పపంచవ్యాప్తంగా ప్రతిరోజూ వెయ్యిమందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అంచానా. అందులో నూట ఇరవై ఐదు మంది భారతీయులే.

◆చావుకి దారితీసే మొదటి పది కారణాలలో ఆత్మహత్య ఒకటి.

◆ప్రతి నలభై సెకన్లకు ఈ ప్రపంచంలో ఒక ఆత్మహత్య జరుగుతుంది.

◆ప్రతీ 3 సెకన్లకు ఒక వ్యక్తి ఆత్మహత్యా ప్రయత్నం చేస్తున్నాడు.

◆15-35 సంవత్సరాల మధ్య వయసువారిలో ఏర్పడే మరణాలకు ముఖ్యమైన 3 కారణాలలో ఆత్మహత్య ఒకటి.

◆పతీ ఆత్మహత్య తాలూకా ప్రభావం కుటుంబ సభ్యులు లేక సన్నిహితులు కనీసం ఆరుగురి జీవితాలపై బలంగా వుంటుంది.

◆తూర్పు యూరోపియన్ దేశాలలో ఆత్మహత్యలు అధికం.

◆మానసిక, సామాజిక, ఆర్థిక కోణాల నుంచి పరిశీలించినప్పుడు ఒక ఆత్మహత్య యొక్క ప్రభావం ఆ కుంటుంబంపైనా, సమాజంపైనా ఎంతనేది లెక్కించడం కష్టం.

◆ప్రపంచంలో జరిగే యుద్ధాలు, నరమేధాలు, హత్యలు మొత్తం అన్నింటివలనా కలిగే నష్టం ఎంతో ఆత్మహత్యల వలన అంతే నష్టం జరుగుతుందని అంచనా. డయాబెటిస్ వ్యాధి వలన ప్రపంచానికి జరిగే నష్టానికి రెట్టింపు నష్టం ఆత్మహత్యల వలన జరుగుతుందని కూడా అంచనా.

◆మనుషులే కాదు లెమ్మింగ్ లాంటి జంతువులు, పెంగ్విన్ వంటి పక్షులు కూడా ఆత్మహత్యలు చేసుకుంటాయి.

◆అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలో పరిశోధనలు చెప్పేదేంటంటే ఆత్మహత్య చేసుకున్న వారిలో 80 శాతం మంది ఏదో ఒక రకం మానసిక వ్యాధితో బాధపడుతున్నవారే.

◆మనదేశంలో దక్షిణాదిరాష్ట్రాలలో మరియు పశ్చిమ బెంగాల్‌లో ఆత్మహత్యలు ఎక్కువ.

◆ఊటీ, కొడైకెనాల్‌లు ఆత్మహత్యలకు ప్రసిద్ధి.

◆ప్రపంచవ్యాప్తంగా పరిశీలించినప్పుడు ఎక్కువ ఆత్మహత్యలు జరిగేవి ఉరి ద్వారానే. వొళ్ళు కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడడం దక్షిణ భారతదేశంలోనే తరచుగా చూస్తాం. పురుగుల మందులు తగడం ఆంధ్రాలో ఎక్కువ. .

◆ప్రముఖ రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే కుటుంబంలో నాలుగు తరాలలో 1997లో మార్గాక్స్ హెమింగ్వే చేసుకున్న ఆత్మహత్య ఐదోదిగా నమోదైంది. జన్యుపరంగా కూడా ఆత్మహత్యలకు పాల్పడే బలహీనత సంక్రమించగలదని శాస్త్రవేత్తల అభిప్రాయం.

◆ఆత్మహత్యల విషయంలో మెదడులో ఊరే సిరోటోనిన్ అనే జీవ రసాయన పదార్థం పాత్ర ఎంతైనా ఉంటుందని శాస్త్రవేత్తలు గమనించారు. అలాగే ఆత్మహత్యలకు పాల్పడేవారిలో డార్సల్ రాఫే, లోకస్ సిరూలియస్ అనే మెదడులోని ప్రాంతాలలో జరిగే మార్పులు కూడా కనిపెట్టారు. అంటే ఆత్మహత్యకు పాల్పడే గుణం కేవలం సామాజిక, ఆర్థిక పరిస్థితులను బట్టే కాకుండా జీవరసాయనాలను బట్టి కూడా ఉంటుందని గ్రహించారు.

◆స్త్రీలు ఎక్కువగా ఆత్మహత్యా ప్రయత్నాలు చేసేవారిలో వుంటే, పురుషులు ఎక్కువగా ఆత్మహత్య చేసుకున్నవారిలో ఉంటారు. అంటే

కొందరు వ్యక్తులు 'ఐడెంటిఫికేషన్' 'ఇంట్రోజెక్షన్' లాంటి మానసిక ప్రక్రియల ద్వారా కొంతమంది వ్యక్తుల పట్లనో, భావజాలం పట్లనో ఆకర్షితులై ఆరాధిస్తూ మమేకమౌతారు. ఎప్పుడైతే తమ ఆరాధ్యదైవం లేక ఆరాధ్య భావన తమకు దూరం అవుతుందని అనిపిస్తుందో అపుడు తమ ప్రాణాన్ని కూడా త్యాగం చేయడానికి సందేహించరు. 'ప్రేమ', 'పరీక్షల్లో ఉత్తీర్ణత' లాంటి వ్యవహారాల్లో అధికంగా ఎమోషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టినవారు కూడా వైఫల్యాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడడం కద్దు.

దానర్థం స్త్రీలలో ఆత్మహత్యా ప్రయత్నాలు ఎక్కువే అవయినప్పటికీ పురుషులు ముగింపులో సఫలీకృతమౌతారు.

◆కొంతమందికి నిజంగా చచ్చిపోవాలని లేకపోయినా ఆత్మహత్యా ప్రయత్నం ద్వారా కీలక వ్యక్తులకు ఒక మెసేజ్ లేక ఒక పాఠం చెబుదామని భావిస్తారు. కొంతమంది క్షణికోద్రేకంలో చేస్తే మరికొందరు దుర్భరమైన మానసిక వేదననుండి బయటపడలేక ఆత్మహత్యకు పాల్పడతారు. మరికొంతమంది తమ చావు ద్వారా ఇతరులకు తమ లేమిని ఫీల్ అయ్యేలా చేద్దామనుకుంటారు. ఆ విధంగా గుణపాఠం చెపుతారు.

◆వృత్తులపరంగా ఆలోచిస్తే, డాక్టర్లు, రైతులు ఎక్కువగా ఆత్మహత్య చేసుకుంటున్నారు.

◆ఒంటరివాళ్లు, జీవితభాగస్వామికి దూరమౌనవారు, విడాకులు పొందినవారు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. యువకులు, వృద్ధులలో మధ్య వయసువారికంటే ఆత్మహత్యలు ఎక్కువే.

ఆత్మహత్యలలో రకాలు :

ఎమిలి దర్కీమ్ అనే సామాజిక శాస్త్రవేత్త ఆత్మహత్యలను ఇలా వర్గీకరించాడు.

●రిటైరయిన ఒక ఆసామి తనకు కేన్సర్ రోగం వచ్చిందని తెలుసుకుంటాడు. ఇతరుల మీద ఆధారపడలేక, సమాజానికి తనెందుకూ పనికిరానివాడినన్న భావనతో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకుంటాడు. ఇది 'ఎనామిక్' ఆత్మహత్య.

●తల్లిదండ్రులతో తీవ్రంగా వాగ్యుద్ధానికి దిగిన స్కూల్‌నుండి వచ్చిన కూతురు ఇంట్లో అందుబాటులో ఉన్న సీసాలోని మొత్తం మందు బిళ్లలన్నీ వేసుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. ఇది 'ఈగోయిస్టిక్ ఆత్మహత్య'. సమాజంతో వేగలేక తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకునే ప్రయత్నం ఇది.

●కొంతమంది నాయకులు తమ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లేదా ఇతరత్రా ప్రయోజనం ఆశించి ఆమరణ నిరాహార దీక్ష చేసి లేక మరోవిధంగానో మరణిస్తారు. సమాజం కోసం చేసే ఇటువంటి బలిదానాలు 'ఆల్ట్రూయిస్టిక్' ఆత్మహత్యలు.

కొందరు వ్యక్తులు 'ఐడెంటిఫికేషన్' 'ఇంట్రోజెక్షన్' లాంటి మానసిక ప్రక్రియల ద్వారా కొంతమంది వ్యక్తుల పట్లనో, భావజాలం పట్లనో ఆకర్షితులై ఆరాధిస్తూ మమేకమౌతారు. ఎప్పుడైతే తమ ఆరాధ్యదైవం లేక ఆరాధ్య భావన తమకు దూరం అవుతుందని ఆనిపిస్తుందో అపుడు తమ ప్రాణాన్ని కూడా త్యాగం చేయడానికి సందేహించరు. 'ప్రేమ', 'పరీక్షల్లో ఉత్తీర్ణత' లాంటి వ్యవహారాల్లో అధికంగా ఎమోషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టినవారు కూడా వైఫల్యాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడడం కద్దు.

ఆత్మహత్య చేసుకునే వ్యక్తులు ఆత్మహత్య చేసుకునే కొన్ని రోజుల ముందు తమ మాటల్లో ఎక్కువగా ఆత్మహత్యల గురించి ప్రస్తావిస్తూ వుంటారు. దాంతో వారి ధోరణిని అర్థం చేసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంటుంది.

ఆత్మహత్యా ప్రయత్నం జరిపేవారిపట్ల చేయకుడనివి :

●ఆవ్యక్తి ధోరణిని తీసేసినట్లు తేలిగ్గా మాట్లాడడం, 'నీకంత ధైర్యం వుందా?' అనడం వంటి మాటలతో గేలి చేయడం, సవాల్ చేయడం కూడదు.

●ఆవ్యక్తి అతని మానానికి అతనిని వదలివేయకూడదు. ఆ ఒంటరితనం డిప్రెషన్‌కు దారి తీయవచ్చు.

●ఇటువంటి వ్యక్తులకు అందుబాటులో ఆత్మహత్య చేసుకునేందుకు ఉపకరించే సామాగ్రి ఏదీ ఉంచకూడదు.

●ఆ వ్యక్తులు తమ సమస్యలు చెప్పినప్పుడు తేలిగ్గా కొట్టి పారేయకూడదు.

ఆత్మహత్యా ప్రయత్నం చేసేవారితో...

◆వారి మాటలన్నీ సానుభూతితో వినాలి. వారి బాధలు సహృదయంతో అర్థం చేసుకోవాలి.

◆వారికి ఆసరాగా, రక్షణగా నిలుస్తామని చెప్పాలి. నమ్మించాలి. నమ్మకానికి తగ్గట్టుగా నిలబడాలి.

◆ఆ వ్యక్తి అభిప్రాయాలను, విలువలను గౌరవిస్తున్నట్లుగా కనిపించాలి.

◆అటువంటి భావం కనిపించిన వ్యక్తికి జీవితపు విలువ గురించి చెప్పాలి. మరణిస్తే ఇక ఏమీ వుండదని, జీవిస్తేనే సమస్యలను ఎదుర్కొని విజయం సాధించగలమని వారి మనసులో నాటుకునేలా చెప్పగలగాలి.

ఆత్మహత్యల నిరోధానికి ప్రతీ కళాశాలలో స్థానిక అధ్యాపకుల సహాయంతో కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. కాస్త వినే ఓర్పు, ఓదార్చే నేర్పు ఉన్నవారెవరైనా కౌన్సిలింగ్ చేయడానికి పనికొస్తారు. ఎన్.ఎస్.ఎస్ కార్యకర్తలు డిప్రెషన్ టెండెన్సీ ఉన్నవాళ్లను గుర్తించి కౌన్సిలింగ్ సెంటర్‌కు రప్పించడానికి కృషి చేయాలి.

సైకోథెరపీ, కౌన్సిలింగ్‌లే కాకుండా డిప్రెషన్ నివారించడానికి సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో మందులు వాడవలసి వుంటుంది. మరికొందరికి ఇ.సి.టి అనే కరెంటు చికిత్స కూడా అవసరం అవుతుంది. భావితరాలలో ఆత్మహత్యల నిరోధానికి సామాజిక, ఆర్థిక పరిస్థితుల మెరుగుదల, సరైన విద్యావిధానం ద్వారా జీవితంపట్ల సరియైన అవగాహన పెంచడం ప్రభుత్వం చేపట్టవలసిన అంశాలు.

★



ఎక్కడున్నాయో...

హలో నేస్తాలూ! ఈ తాత గెటప్ భలేగా వుంది కదా. చాలా సీరియస్ పుస్తకం పట్టుకుని చదివేస్తున్నాడు. ఐతే ఈ బొమ్మలో పది రకాల (జంతువులు, పక్షుల) ముఖాలు వున్నాయి. అవి ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి.

తేడాలు ఏంటబ్బా...

హలో పిల్లలూ... ఈ రెండు బొమ్మల మధ్య ఏడు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.





అబ్బాయిలూ మీరెక్కడ?

హలో పిల్లలూ...ఇక్కడ మీకో పూలకుండీ పెట్టుకునే స్టాండ్ కనిపిస్తుంది కదా. కానీ అక్కడ ఇద్దరు అబ్బాయిలు కూడా వున్నారు. మరి ఎక్కడో చూడండి. తెలీకపోతే మా జవాబు చూడండి.

చిట్టి పాండా ఎక్కడ?

హాయ్ నేస్తాలూ... ఈ తల్లి పాండాకి తన బిడ్డ ఎక్కడుందో కనిపించలేదంట. మీకేమైనా కనిపించిందా?

మీకు తెలుసా?

హాయ్... చిన్నారులూ! ఇవాళ బీవర్‌కు సంబంధించిన 4 ప్రశ్నలడుగుతాం. మీరు అవునో కాదో టకటకా చెప్పాలి. అయితే ఆ తర్వాత మా జవాబుతో మీ సమాధానాలను సరిచూసుకోండి. ఎన్ని సరిగ్గా వుంటే మీకు అన్ని మార్కులొచ్చినట్టు.

1.బీవర్ (ఎలుక వంటి ఉభయచర జీవి) 5 అంగుళాల చెట్టును 3 నిమిషాల్లో పటపట కొరికేస్తుంది.

2. అవి 5 నిమిషాల సేపు గాలి పీల్చకుండా నీళ్లలో మునిగి ఉండగలవు.

3. రికార్డుకెక్కిన అతి పెద్ద బీవర్ 86 పౌండ్ల బరువుంటుంది.

4. ఒకే వయసులో ఉన్నా ఆడ బీవర్‌ల కంటే మగ బీవర్‌లు పెద్దగా ఉంటాయి.



వెతికేస్తే పోలా!

ఫ్రెండ్స్... పై బొమ్మలో కొన్ని వస్తువులు దాగున్నాయి. అవేంటంటే... స్కేలు, రెండు ఎన్వలప్ కవర్లు, పుట్టగొడుగు, ఇస్త్రీపెట్టె, ఫోన్ రిసీవర్, ఉంగరం, రాకెట్, పూలకుండీ, పక్షి, బూటు, అరటికాయ. ఇవన్నీ ఎక్కడున్నాయో వెతికి పట్టుకుని సున్నా చుట్టండి.

చుక్కలు కలిపేద్దామా...



వాళ్లెవరో!

హాయ్ నేస్తాలూ... ఇక్కడున్న నలుగురు అమ్మాయిల్లో ఇద్దరు అచ్చంగా ఒకేలా వున్నరు. వాళ్లెవరు?

జవాబులు

తేడాలు ఏంటబ్బా... :
1. గొడుగు పై భాగం. 2. అబ్బాయి చేతిలోని బక్కెట్లో నీరు. 3. అబ్బాయి చేతిలో మట్టి తవ్వే ఇనుప రాడ్. 4. ఇంటిముందున్న నక్షత్రం. 5. అబ్బాయి పెట్టుకున్న టోపీ. 6. అబ్బాయి పెట్టుకున్న బెల్ట్. 7. ఇంటి మధ్యలో గోపురంలో ఉన్న కిటికీ.

చిట్టి పాండా ఎక్కడ? తల్లిపాండా పక్కనున్న చెట్లలో చూడండి.

వాళ్లెవరో!... 2, 4

అబ్బాయిలూ మీరెక్కడ?... పూలకుండీ రెండు వైపులా ఇద్దరబ్బాయిలూ వున్నారు.

మీకు తెలుసా?: 1.అవును. 2.కాదు. బీవర్‌లు 15 నిమిషాల వరకు నీళ్లలో మునిగి ఉండగలవు. 3. అవును. 4. కాదు. ఆడ బీవర్లు చాలా పెద్దగా, ఒక్కోసారి మగ వాటికంటే కూడా పెద్దగా ఉంటాయి.

ఎంత వద్దనుకున్నా, ఎందరు వద్దంటున్నా కొన్ని పనులు అలా జరిగిపోతూనే ఉంటాయి. మన ప్రమేయం వాటిలో ఉంటే కొంతమేరకే ఉంటుంది. లేదా అసలు ఉండనే ఉండదు. బహుశా ప్రేమ.. ఒకరి పట్ల ఇష్టం, అభిమానం, ఆప్యాయత, దగ్గరితనం వంటి ఉన్నతమైన వాటితో పాటు, ఎప్పటికీ దగ్గరే ఉండాలనుకోవడం, ఎంతసేపైనా విసుగనిపించకపోవడం, కళ్లు మూసినా, తెరిచినా నీవే లాంటి విచిత్ర లక్షణాలు కూడా కలిసి ఉండే భావన.. అటువంటి వాటిలో ఒకటి. ప్రేమ యూనివర్సల్ అంటారు. అందులో 'పడ్డామని' అనుకునే వాళ్లు కావచ్చు. కానీ మరెన్నో మానవ అనుభూతులు, భావావేశాలు కూడా విశ్వజనీనాలే, విశ్వవ్యాప్తాలే అయితే ప్రేమ తప్ప మరో దాని గురించి మనం పట్టించుకోము. అలా పట్టించుకోక పోవడమూ సర్వ వ్యాప్తంగా మనసులకున్న గుణమే!

ప్రేమ తాలూకు వర్ణనలు, నిర్వచనాలు, చర్చలు, విశ్లేషణలు, వివరణలు, కథలు, కావ్యాలు కోకొల్లలు. ప్రేమ నేపథ్యంలో చెలరేగినన్ని పోరాటాలు, దారుణాలు, దమనకాండలు, నిత్య ఆందోళనలు మరే అంశం వల్లా జరిగివుండకపోవచ్చు. మానవ సమాజ పరిణామంలో అంత విస్తృతి కలిగిన ప్రేమ అనే అంశం అహరహం నిత్యనూతనమే, నిత్య చర్చనీయమే. ప్రేమకి ఎన్ని రకాల వైవిధ్యాలు ఆపాదించినా, ఎన్ని రకాల వైచిత్రులు అంటగట్టినా అదో ప్రత్యేకత. అదో విశిష్టత. కొన్ని సంవత్సరాలుగా దేశంలో దిగబడి చలామణి అవుతున్న ప్రేమికుల రోజు.. వాలెంటైన్స్ డే.. మరింత ప్రత్యేకం.

- కాకర్లమూడి విజయ్

ప్రేమికులకు ఒక రోజు

అసలు ప్రేమకు, ప్రేమికులకు (మానవ-మానవ ప్రేమికులు... జంతు, వృక్ష, ప్రకృతి ఇత్యాది ప్రేమికులకు కాదు) ఒక రోజు కేటాయించడం విశేషమే కాదు వింతగా కూడా ఉంది కదూ? ఆ మాటకొస్తే ఈ మధ్య ప్రతిదానికీ ఓ రోజు పెట్టేసి నెలలో అన్ని రోజులూ తీరిక లేకుండా ఉండడం సాధారణం అయిపోయింది. ఒకప్పుడు పుట్టిన రోజులూ, గిట్టిన రోజులూ, సరదాకి పెళ్లి రోజులూ, తప్పక స్వతంత్ర, గణతంత్ర దినాలూ కాక వేరేవి అంతగా ఉండేవి కావు. ఇప్పుడో? అమ్మకోటి నాన్నకోటి, పిల్లలకోటి, పంతుళ్లకోటి, చివరికి ఎయిడ్స్ రోగానికి ఓ రోజు పెట్టుకున్నాం. ఆ క్రమంలోనే ప్రేమికుల రోజు మరింత విశేషంగా ఉంది.

వాస్తవానికి ప్రేమ వంటి లలితానుభూతుల వ్యక్తీకరణకు మార్గాలు అనంతం. అవి నిత్యం ఇరువురి మధ్య ఉంటూ, వారి జీవితాల మధ్య నిరంతరాయంగా ప్రవహించే జీవనదులు. వాటికి ఫలానా రోజు ప్రత్యేకం అని ఉండనక్కర్లేదు.

అయినా వాలెంటైన్స్ డే సందడి మామూలుగా ఉండదు మరి. భార్యకు నెలలో నాలుగైదు గిఫ్టులు ఇచ్చే భర్త కూడా వారి పెళ్లి రోజున ఏదో ఒక బహుమతి ఇవ్వకపోతే భార్యకి ఏ విధంగా కోపం శివాలెత్తుతుందో ఆ విధంగా రోజూ తెగ తిరిగే ప్రేమికులకు 'వాలెంటైన్స్ డే' నాడు కలవకపోతే అంతకుముందు ప్రేమంతా తూచ్ అన్నట్లే. పూలు(ఎర్రగులాబీలే సుమా!), చాక్లెట్‌ల నుండి ఖరీదైన గ్రీటింగ్ కార్డులు, బహుమతులు(ఇవి వస్తు రూపేణానే ఉండవలసిన అవసరం లేదని కొందరు వెటరన్ ప్రేమికుల ఉవాచ!) వగైరాల ద్వారా తమ మధ్య ప్రేమను మరోసారి తెలియపరచుకోవడం నేటి తరహా. ఇటువంటి రోజులూ, ఆ రోజుల్లో బహుమతులూ తమ మధ్య ఉన్న అనుబంధం సంవత్సరం దాటినా బలహీన పడలేదని, పక్కదారి పట్టలేదని నమ్మకం కుదుర్చుకోవడానికే అని సీనియర్ ప్రేమికులు ప్రేమసూక్ష్మాన్ని మనబోటి అర్భకులకు తెలియజేస్తారు.

ఇలా ఈ ఒక్క రోజే, ఏడాదిగా దాచుకున్న ప్రేమను ధారాళంగా ఒకరిపై ఒకరు కుమ్మరించేసుకుని మళ్లీ వచ్చే ఏడాది ఈ రోజు కోసం, తేనెటీగలు రోజూ తేనెను దాచినట్టు ప్రేమను దాచుకుంటూ, ఎదురు చూడడం మామూలే. అయితే ప్రేమను పంచుకోవడానికి ఈ సారి ఉన్నవారే ఆ వచ్చే ఏడాది ఉంటారన్న గ్యారంటీ వుండకపోవచ్చు. ప్రస్తుత పరిస్థితులను బట్టి అలా అనాల్సి వస్తోంది. పాపము శమించుగాక. ఇటువంటి కొందరి మధ్య పాపం నిజాయితీగా, అదేదో వ్రతంలా క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరమూ కలుసుకునే జీవులూ ఉన్నారు. ఈ క్రమంలో కొందరికి పెళ్లిళ్లు అయిపోతాయి. ఇక్కడ కూడా, ప్రేమించిన వారితోనే పెళ్లి అయిందనుకోవడానికి వీల్లేదు. కాల ప్రభావం! ఏతావాతా ప్రేమికుల రోజు మాత్రం ఘనంగా సాగిపోతుంటుంది!

అసలిది భారతీయ సంప్రదాయమే(పోనీ అలవాటు) కాదని చిరాకు ప్రదర్శించే వాళ్లు చాలామందే ఉన్నారు. అలా చిర్రు బుర్రులాడేవాళ్లు ప్రేమికులు కాని వాళ్లయినా అయి ఉండాలి, లేదా

ప్రేమలో దెబ్బతిన్న వాళ్లయినా అయి ఉండాలి అంటారు ఇతరులు. ఇదిగాక రాజకీయ కాషాయిస్టులుంటారు. గత నాలుగైదు సంవత్సరాల నుండి కొంతమంది ఈ సాంప్రదాయిస్టులు తమ ఇష్టారాజ్యంగా వాలెంటైన్స్ డే నాడు ప్రేమికుల వేట సాగిస్తున్నారు. ఆ రోజు పార్కుల్లో కనబడిన జంటల్ని, వెంటతెచ్చుకున్న పసుపు తాడుతో కట్టి పారేస్తామని బెదిరిస్తున్నారు. విచిత్రమేమిటంటే, అటువంటి బెదిరింపులకు నిజంగా భయపడిన వాళ్లు ఎక్కువ మంది లేనట్టే ఉన్నారు. ఎందుకంటే సదరు సనాతన ధర్మకర్తలు(గా ప్రకటించుకునే వారు) ప్రతి సంవత్సరమూ తమ దాడులను నిర్వహించాల్సివస్తోంది(ప్రేమ దేనికీ భయపడదు?!) వాళ్ల కోపానికి కారణం వాలెంటైన్స్ డే మన దేశ సత్సాంప్రదాయాలను సమూలంగా నాశనం చేస్తోందని. "మరి పబ్ కల్చర్ వంటివి మన సాంప్రదాయాలా? టీవీ ఛానెళ్లలో కుటుంబ కథల పేరుతో విచ్చలవిడి అసూయ, ద్వేషాలను, మాయా మోసాలను సవివరంగా చూపిస్తున్నారు కదా... అవన్నీ మన ఘన సంప్రదాయాలేనా? అన్నది ఓ ప్రశ్న. సరే, ఇటువంటి ప్రశ్నలకు ఎన్ని రకాల చర్చలు పెట్టినా ఎప్పటికీ సమాధానం లభించదు. కాలంతో పాటు కదిలి పోవాలన్నది అందరి అభిమతం. తమకు నచ్చని విషయాలపై నిరసన వ్యక్తం చేయడం ఇంకొందరి మతం. "స్నేహితులు(ప్రేమికులు) ఆ ఒక్క రోజే కాదు, దాదాపు ప్రతి రోజూ కలుసుకుంటారు. అప్పుడు వారి వల్ల సంప్రదాయానికి ఇబ్బంది ఉండదా?" అని మరో ప్రశ్న. "వీరికి కనిపించేట్టు అందరూ పార్కుల్లోనే తిరగరు. మరి అలా కనిపించని వారి మాటేమిటి?" అని ఇంకో ప్రశ్న. "అసలు ప్రేమ పేరుతో ప్రతి రోజూ జరుగుతున్న మోసాలు, హింసలు, దారుణాలు వీరికి కనిపించవా? ప్రేమించలేదని అందరి ముందు కత్తితో మెడ నరికి చంపిన వాడు, ముఖంపై ఆసిడ్ పోసినవాడు ఏ సంప్రదాయాన్ని, సంస్కృతిని చాటుతున్నట్టు? అటువంటి వారిని వదిలి మమ్మల్ని బెదిరిస్తే లాభమేంటి?" అని ఒక జంట తమలోని కోపాన్ని వెలిబుచ్చింది. విశేషమేమిటంటే, దాదాపు ఇటువంటి కారణాల వల్లే అసలు ఈ ప్రేమికుల రోజుకు పునాది పడింది.

క్రీస్తు శకం 270 ప్రాంతాలలో రోమ్‌లో వాలెంటైన్స్ అనే క్రైస్తవ ప్రవక్త ఉండేవాడు. ప్రేమ వల్ల ప్రపంచం ఆహ్లాదంగా, ఆనందంగా మారుతుందని అతని అభిప్రాయం. అందుకే రహస్యంగా యువతీ యువకులకు ప్రేమోపదేశాలు చేసి, వారిలో ప్రేమ వివాహాలను ప్రోత్సహించడం ప్రారంభించాడు. వాలెంటైన్స్‌కి రోజు రోజుకు అభిమానులు పెరిగిపోవడంతో రోమ్ రాజు క్లాడియస్‌కి చింత పట్టుకుంది. దేశ సంరక్షణలో పాలు పంచుకోవలసిన యువతకు ప్రేమ పాఠాలు నేర్పి బలహీనులుగా తయారు చేస్తున్నాడన్న అభియోగంపై క్లాడియస్ వాలెంటైన్‌కి మరణ శిక్ష విధించాడు. వాలెంటైన్ అభిమానుల్లో క్లాడియస్ కుమార్తె కూడా ఉండడం విశేషం. ప్రేమకు మరో పేరుగా మారిన వాలెంటైన్‌ను ఫిబ్రవరి 14న ఉరితీశారు. ఆయన అస్థికలు రోమ్‌లోని టేర్నీలో ఆయన జన్మించినట్టు భావిస్తున్న ప్రదేశంలో ఉన్నాయని అంటారు. ఏటా ప్రేమికులు అక్కడికి చేరుకుని వాలెంటైన్ సమాధిపై పూలు ఉంచి ప్రేమను చాటుతారు.

వాలెంటైన్ మరణించిన తరువాత రెండు దశాబ్దాలకు... క్రీ.శ. 496లో ... అప్పటి పోప్, గెలాసియస్ ఫిబ్రవరి 14ను వాలెంటైన్స్ డేగా ప్రకటించాడు. ఎక్కడో రోమ్‌లో, అదీ శతాబ్దాల క్రితం జీవించిన ఒక క్రైస్తవ ప్రవక్త పేరుతో మొదలైన రోజు ప్రపంచీకరణ పుణ్యాన మన ముంగిట్లోకి దూసుకొచ్చింది. బోలెడు ఉత్తుత్తి హంగామా తెచ్చింది. సహజంగానే భారతదేశంలో కొంతమందికి అయిష్టత ఉంటుంది. కానీ ప్రేమకు మతం, కాలం, ప్రాంతం వంటి ఎల్లలు ఉండవని పదే పదే నిరూపణవుతోంది.

ప్రేమ వ్యాపారం

ప్రేమ వ్యాపారం అని అంటే ఆగ్రహంగా దండెత్తి హడావిడి చేసేవాళ్లకు ప్రస్తుతం కొదవలేదు. కానీ ఈ ప్రేమికుల రోజు ఆసరాగా ప్రేమ అనేక వ్యాపారాలను మూడు పువ్వులు ఆరు కార్డుల్లా విరాజిల్లచేస్తోంది అనేది అక్షర సత్యం. ప్రేమ పేరుతో జరిగే వ్యాపారం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుంది అనడానికి ఎటువంటి సందేహమూ అవసరం లేదు. ఫ్లోరిస్టుల నుండి గ్రీటింగ్ కార్డులు అమ్మే వారి వరకు ఆ రోజు అనేక గిఫ్టుల దుకాణాలు కళకళలాడుతూ ఉంటాయి. కొన్ని షాపులు కేవలం ఆ ఒక్క రోజే వ్యాపారం చేస్తాయి. ఇక సాంకేతిక పరిజ్ఞానం వాలెంటైన్స్ డేకి పనికి వచ్చినట్టు మరెప్పుడూ రాదన్నంతగా విజ్రుంభిస్తుంది. సెల్ ఫోన్లలో ఎస్సెమ్మెస్‌లు, ఎమ్మెమ్మెస్‌లు, ఎఫ్ఎం రేడియో, టీవీలలో సందేశాలు, ఇమెయిల్లు, ఇంటర్నెట్‌లు... అసలు ఈ టెక్నాలజీ అంతా ఈ ఒక్క రోజును దృష్టిలో ఉంచుకుని రూపొందించారా అన్నంతగా ఉంటుంది సందడి.

ఈ సంవత్సరం వాలెంటైన్స్ డే మరింత వ్యాపారవృద్ధి కారకం కానుంది. కారణం... ఆదివారం కావడం. అందువల్ల ఈ సారి నేరుగా గిఫ్టులు ఇచ్చుకోవడం, అదీ రెస్టారెంట్లలో డిన్నర్‌ల మధ్య జరిగే



అవకాశాలు ఎక్కువ అని పరిశీలకులు అంటున్నారు. కాబట్టి, అటు బహుమతులతో పాటు ఇటు హోటళ్లు కూడా బిజీగా ఉంటాయన్న మాట. ఇక ఇ బే, బెస్ట్ బై, అమజాన్, రిడిఫ్ వంటి ఆన్‌లైన్ వ్యాపారాలు ఇప్పటికి అనూహ్యమైన బుకింగ్‌లను నమోదు చేసుకున్నాయి. ఈ సారి అటువంటి ఆన్‌లైన్ గిఫ్టులే మెరుగని అంటున్నారు. అందుకు కారణం గిఫ్టు షాపులపై కూడా దాడులు జరగడం.

ఎవరీ వాలెంటైన్?

వాలెంటైన్ ఏనాటి వాడైనా గాని, నిత్యనూతనంగా ఉండే ప్రేమను దాటించి, పాటింపచేసి, మరణించి కూడా తరతరాల ప్రేమికుల ద్వారా జీవించే ఉన్నాడు. మొత్తానికి వాలెంటైన్స్ డే నాడు అటు ప్రేమికులకే కాక, వ్యాపారస్తులకు, నిరసనకారులకు కూడా తీరిక లేకుండా ఉంటుంది.

వాలెంటైన్ చివరి లేఖ క్లాడియస్ రాజు కుమార్తెకి రాశాడట. దానిలో చివరన... నీ వాలెంటైన్ అని ఉందట. అప్పటి నుండి, ప్రేమికులు పరస్పరం వాలెంటైన్‌గా సంభోదించడం మొదలైంది.

రోమ్ ఇతిహాసాలలో వీనస్ ప్రేమ దేవత. ఆమెకు అత్యంత ప్రియమైన పుష్పం ఎర్ర గులాబీ. అందుకే ప్రేమను స్పష్టంగాను, సున్నితంగాను వ్యక్తపరచడానికి ఎర్ర గులాబీని వాడతారు. ఈ ఒక్క రోజు ఎర్రగులాబీల వ్యాపారం కొన్ని బిలియన్ల డాలర్లు ఉంటుంది.

తిరగేసిన రావి ఆకులా వేసిన బొమ్మ ప్రేమకు చిహ్నంగా సుపరిచితమే. ఆ గుర్తు హృదయానికి సంకేతం. మనకు మన్మధుడిలా గ్రీకులకు ఎరోస్, రోమన్లకు క్యుపిడ్‌లు ప్రేమదేవతలు. వారు వేసిన బాణం గుండెలో గుచ్చుకుందంటే ఇక ఆ వ్యక్తి ప్రేమలో గిలగిల కొట్టుకోవలసిందే! అందుకే మన కాలేజీ గోడలపైన ప్రేమ చిహ్నంలో బాణాన్ని గుచ్చేస్తారు. ఆధునిక ఎరోస్‌లో, క్యుపిడ్‌లు ప్రేమ హృదయానికి సంబంధించినది కావడం వల్ల దానిని ఎరుపు రంగులో చూపడం రొమాంటిక్‌గా ఉంటుందట.

వాలెంటైన్స్ డే నాడు అందరూ ఏదో విధంగా లాభపడుతుంటే, నష్టపోయేది ఎవరో తెలుసా? పోస్టల్ డిపార్టుమెంటు!! మరి అంతా కొరియర్లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్ల మయం అయిపోయిందిగా.

బ్రిటన్, అమెరికా, కెనడాలలో కొన్ని స్కూళ్లలో కూడా వాలెంటైన్స్ డే జరుపుకుంటారు. స్నేహితులకు గ్రీటింగ్ కార్డులు, చాక్లెట్లు ఇచ్చుకోవడం పరిపాటి.

వాలెంటైన్స్ (గ్రీటింగ్ కార్డు) పంపడం గ్రేట్ బ్రిటన్‌లో 19వ శతాబ్దంలోనే ప్రారంభమైంది. ఎస్తేర్ హోవ్లాండ్ అనే ఆవిడ స్వంతంగా తయారుచేసిన కార్డులతో వ్యాపారం ఆరంభించింది.

సుమారు ఒక బిలియన్ కార్డులు ఈ రోజు అమ్ముడు పోతాయని అమెరికా గ్రీటింగ్ కార్డుల సమాఖ్య అంచనా. క్రిస్టమస్ తరువాత అధిక సంఖ్యలో అమ్మకాలు జరిగే రోజు వాలెంటైన్స్ డే.

★

ప్రేమికులూ, ప్రేరకులూ!

వాలెంటైన్స్ డే అంటే? మిగిలిన అన్ని పదాల అరకొర అనువాదాలలాగే దీన్ని మనం ప్రేమికుల రోజు అని పిలుచుకుంటున్నాం. కానైతే అత్యంత ప్రామాణిక నిఘంటువులను తిరగేయండి. వలైంటెన్ అంటే ఎవరైనా ప్రేమించినవారు, లేదా శృంగార సంబంధం పెట్టుకోవాలని అభిలషించేవారు అని ఉంటుంది. అలాంటివారికి సంతకం లేకుండా ఇచ్చేది వాలెంటైన్స్ కార్డు. అలా ఇచ్చేరోజు వాలెంటైన్స్ డే. వాస్తవానికి వసంతోత్సవాలు ఇంతకన్నా సహజమైనవే కాదు, అత్యంత పురాతనమైనవి కూడా. దాంతో పోలిస్తే వాలెంటైన్స్ డే చరిత్ర చాలా తక్కువ. అది మనకు పరిచయమై గట్టిగా పదేళ్లు కూడా కాలేదు. అయితేనేం? దృశ్యమాధ్యమం పుణ్యాన అతి కొద్ది కాలాంలో అత్యధిక ప్రచారం. ఏడాదిలో అతి ముఖ్యమైన రోజుగా యువ హృదయాలలో స్థానం. దాదాపు నెల రోజుల ముందు నుంచీ దాని గురించే ప్రచారం, ఆఫర్లు, ఆకర్షణలు!

అనంత కాలాల నుంచి అనిర్వచనీయమైందిగా కొనసాగుతున్న ప్రేమ భావనను కార్డులలోనూ, కానుకలలోనూ బంధించ చూడడం అసాధ్యమైన విషయం. ప్రకృతి సిద్ధమైన ప్రేమలు లేని కాలాన్ని ఊహించడం అర్థరహితం. కానీ మన ఆధిపత్య సంస్కృతిలో అత్యధిక కాలంపాటు అది కూడా పురుషులకూ, పై కులాల వారికి పరిమితమైందిగా లిఖిత సాహిత్యం చెబుతున్నది. జానపదంలో లేదా అసలు సిసలు తెలుగు సాహిత్యంలో మాత్రం సహజసిద్ధమైన ప్రేమ, శృంగారాలు పొంగిపొర్లుతుంటాయి. అప్పటి వరకూ పురుష పుంగవులు వారి సరసన పతివ్రతా శిరోమణులూ లేదా అప్సరసలూ మాత్రమే ఉంటారు. గురజాడ అప్పారావు వచ్చేవరకూ స్త్రీపురుషుల మధ్య సమాన ప్రతిపత్తిలో ప్రేమ తెలుగు సాహిత్యంలో లేదు. తర్వాతి కాలంలో భావకవులు తమ సామాజిక సరిహద్దులు దాటలేక సహజస్థితమైన ప్రేమానుభూతులు చాటలేక అప్రాప్తమనోహరితో అమలిన శృంగారం కోసం శోకభీకరతిమిరలోకైక పతులైనారు! ఆ తర్వాత చలనచిత్రాలు- ప్రేమే నేరమౌనా అని ప్రశ్నించాయి. అదో ఆశ. అప్పుడూ ప్రేమికుల రోజులు తెలియవు. పదేళ్ల ప్రపంచీకరణ ప్రభావం, దృశ్యమాధ్యమ విస్తరణ, తద్వారా విదేశీ ఛానళ్ల దిగుమతి, ఇంటర్‌నెట్ అనబడే విశ్వవలలో వలపులవయ్యాగ్రాలు, వాలెంటైన్స్ సంస్కృతి దిగుమతి. శివ సైనికులలా దీనిపై కత్తికట్టడంలో అర్థం లేదు. ఎందుకంటే విత్తనాన్ని బట్టి పంట. మార్కెట్ మాయాబజార్ చమక్కులలో ఇవన్నీ తప్పవు.

వేదాంతులు చెప్పే స్వస్వరూప జ్ఞానం అనే ఐడెంటిటీయే ఈ మార్కెట్ మాయాజాలంలో మారిపోతున్నది. ప్రబంధ నాయకానాయికలను మించిన నవీన సౌందర్య సంపన్నత నిర్వచనాల ఎండమావులలో తమను తాము బిగించుకుంటున్న జనాలకు తమ ఇష్టాయిష్టాలు తేల్చుకోవడం కష్టనష్టాలు బేరీజు వేసుకోవడం అలవిమీరిన పనిగా తయారైంది. మన జీవితాలు మనం జీవించడం గాక జీవించబడడం జరుగుతున్నట్టే ప్రేమించడం గాక ప్రేమించబడడం కోసం పాకులాడడం దానిలో విజేతలు కావాలని పరుగులు పెట్టడం ఒక అగమ్య ప్రక్రియ. ఆ మాటంటే ఆధునికులం కాకుండా పోతామనే మీమాంస. దానివల్ల మనకూ ప్రయోజనమేమో చూద్దామన్న ప్రలోభం. ఇలాటి కృత్రిమ విన్యాసాలతో ఏవి నిజమైన ప్రేమలో ఏవి ఉత్తి భ్రమలో తెలుసుకోవడం, తెలుపబోవడం ఎవరికైనా సాధ్యమయ్యేదేనా? అందుకే మెహర్బానీ ముర్దాబాద్, మొహబ్బత్ జిందాబాద్. మనసున్న ప్రేమికులకు అభినందన. మాయా ప్రేరకులకు అభిశంసన.



సూక్ష్మంలో మోక్షం - ఘరానా మోసం

నాన్నా మనం కూడా స్లిమ్‌సోనా బెల్ట్ కొనుక్కుందామా అన్నాడు నా పుత్రరత్నం ఓరోజు.
ఎందుకు నాన్నా మనకు?
ఒకటి కొంటే రెండు ఫ్రీగా ఇస్తారట, వాళ్లే మనింటికి పంపుతారట అన్నాడు.
వద్దులే మనకు, అయినా అవెందుకు?
1999 రూపాయలది టెలిమార్కెటింగ్‌లో కొంటే 199 రూపాయలకే ఇస్తారట. అమ్మా నువ్వు కొంటావా అన్నాడు, నాతో బేరం కుదరదనుకున్నాడేమో.
షాప్‌కెళితే ఫ్రీ గిఫ్ట్ ఆఫర్స్ ఏం ఉన్నాయా అని వెతికే మీ లక్షణాలే వాడికీ వచ్చాయి అంది శ్రీమతి.

నాకు తెలిసిన ఒక కుటుంబంలో భర్తకు ఫిట్‌నెస్ అంటే మహామోజు. అందుకోసం మార్కెట్‌లో దొరికే చిన్నా చితకా చిట్కా పరికరాలు కనీసం వందైనా కొని ఉంటాడు. అవి కొన్ని రెండుమూడు రోజులకే పనికిరాకపోవటమో, సెల్ఫ్‌వేసేందుకు జేబులు ఖాళీకావటమో, లేదా ప్రయోజనం లేదన్న జ్ఞానోదయం కలగటమో ఏదో ఒకకారణంతో అది మూలనపడేది. ఈలోగా మార్కెట్‌లో మరో కొత్తది వచ్చేది. షరా మామూలే. పనికిమాలినవన్నీ కొనుగోలు చేసి ఇంట్లో పడేస్తే సర్దలేక చస్తున్నా అని భార్య విసుక్కొనేది. చాలా సంవత్సరాల తరువాత వాళ్లింటికి వెళితే పరిస్థితి తారుమారైంది. పనికిమాలిన ఫిట్‌నెస్ పరికరాలన్నింటికీ డబ్బుతగలేస్తోంది, ప్రయోజనం లేదని చెప్పినా వినటం లేదని భర్త ఫిర్యాదు. ఈ మధ్య తిండి తగ్గించినా ఒళ్లు తగ్గటం లేదు, అందుకే చుట్టుపక్కల వారు చెబితే కొని వాడి చూద్దామని ఒకటో అరో కొంటే ఇదిగో ఇలా సొదపెడతారు. అయినా ఆయన కొన్నవాటితో పోల్చితే నేను కొన్నవెన్ని?

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. పట్టణీకరణతో పాటు సమాజానికి కొత్త సమస్యలు వచ్చాయి. ఉద్యోగం ఒకచోట, ఉండేది మరొక చోట. అందువల్ల జనం యంత్రాల్లా మారిపోతున్నారు. దానికి తోడు శారీరకశ్రమ తగ్గుతోంది. దాంతో ఫిట్‌నెస్ సమస్య ముందుకు వస్తోంది. ఆడామగా తేడా లేకుండా సూక్ష్మంలో మోక్షం పొందేందుకు చూస్తున్నారు. దాన్ని సొమ్ముచేసుకొనేందుకు అనేక మంది తయారు. పెరిగిన మీ కొవ్వు తగ్గాలంటే మీరు ఏమాత్రం శ్రమపడనవసరం లేదు. మా బెల్టుపెట్టుకొంటే 30 రోజుల్లో నాలుగంగుళాల చుట్టుకొలత తగ్గుతుంది అని ఒకరు. కొవ్వు చేరే చోట మా మిషన్ పెట్టుకొని మీరు ఎంచక్కా టీవీ చూడవచ్చు, పనులు చేసుకోవచ్చు, 45 రోజుల్లో ఐదు కిలోల బరువు తగ్గుతారు అని మరొకరు.

మార్కెట్‌లో వచ్చే ఇతర కంపెనీల మిషన్లను వాడేవారు వాటితో పాటు డైటింగ్ కూడా చెయ్యాలి. మా ప్రత్యేక ఉత్పత్తిని వాడిన సినీతారలు డైటింగ్ లేకుండా ఇష్టమొచ్చింది, ఇష్టమొచ్చినంత తిని 60 రోజుల్లో పదికిలోల బరువు తగ్గారు. అలా తగ్గకపోతే మీ డబ్బుమీరు తీసుకొని మా మిషన్ వాపసు ఇచ్చేయవచ్చు. వయస్సు కంటే మీ ముఖం ఎక్కువగా ముడతలు పడినట్లు అనిపిస్తోందా మా వైబ్రేటర్ వాడండి పదిరోజుల్లో మీ ముఖం మిసమిసలాడుతుంది. మా థైమాస్టర్ వాడితే నెలరోజుల్లో మీరు శిల్పాషెట్టిలా అవుతారు. ఇలా ఎన్నో పరికరాలు. ఒక పరిశోధన ప్రకారం ఇలాంటి పరికరాలలో ప్రతిపదింటిలో తొమ్మిది పనికిమాలినవే. అందుకే ఇలాంటి పరికరాలు కొన్నవారు ఇంటికి తెచ్చుకున్న తరువాత గొల్లు మంటున్నారు.

ప్రపంచమంతా తినటానికి బతుకుతోంది, నేను మాత్రం బతకటానికి తింటున్నా అని తత్వవేత్త సోక్రటీస్ చెప్పారు. పశ్చిమదేశాలలో కలిగిన వారు క్రిస్మస్ న్యూయియర్ మధ్య వచ్చే సెలవుల్లో ఏం తినాలా అని సతమతమౌతారట. లేనివారు నూతన సంవత్సరాది క్రిస్మస్ మధ్య ఏం తినాలా అని ఆందోళనపడతారట. అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎప్పుడు ఎడతెగకపారు ఏరు ఉండేచోట ఉండమని నాటి పెద్దలు చెప్పారు. ఈ మధ్య ఊబకాయం తగ్గించే క్లినిక్‌లు, బ్యూటీపార్లర్‌లు కూడా ఉన్నచోటే ఉండాలని నేటి కన్సల్టెంట్‌లు చెబుతున్నారు. తాను లావెక్కుతున్నానని మా చెల్లెలు తెగ ఆందోళన పడిపోతోంది. నా పొడవు, వెడల్పు సమం అవుతున్నదని మా ఆవిడ పోరు పెడుతోంది. అక్కా నువ్వు కూడా తక్కువ లేవే రాత్రి పగలు ఆ సీరియల్స్ చూడటం ఆపేయకపోతే చివరకు ఆ టీవీయే నిన్ను చంపేస్తుందేమోనే అని మా బావమరిది ఒకటే ఆందోళన. అంతేకాదు ఇది చదువంటూ ఏదో పేపర్ కటింగ్ ఇచ్చాడు. దాన్ని మా ఆవిడ చదవటమే కాదు, వారాంతపు 'కిట్టీ' పార్టీలో తోటి సీరియల్స్ స్నేహితురాళ్లకు కూడా దాన్ని చదివి వినిపించింది. వారంతా తెగ ఆందోళన పడిపోతున్నారు.

ఎక్కువసేపు టీవీ చూసేవారిలో గుండె సంబంధమైన వ్యాధులతో అర్ధాంతపు చావులు 46శాతం ఎక్కువగా ఉన్నాయట. కదలకుండా గంటలతరబడి కూచొని అదేపనిగా టీవీ చూస్తే అసాధారణ జీవనక్రియతో శరీరంలో కొవ్వు, గ్లూకోస్ పెరుగుతాయి. నిదురపోయేటపుడు ఖర్చయ్యేకాలరీలకు కదలకుండా ఏకాగ్రతతో టీవీ చూసేటపుడు అయ్యే కాలరీల ఖర్చుకు పెద్ద తేడా ఉండదని ఆస్ట్రేలియా వైద్యులు ఒక పరిశోధనలో తేల్చారు. కొంతమంది కదలిక కోసం టీవీ రిమోట్‌లను దూరంగా పారవేసి ఛానల్స్ మార్చేందుకు తరచూ లేస్తున్నప్పటికీ దానివలన పెద్ద ప్రయోజనం ఉండదట. టీవీ చూడటమే కాదు, కుర్చీలో కదలకుండా ఎక్కువసేపు పనిచేసినా ఊబకాయ సౌభాగ్యం వచ్చే అవకాశాలున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థవారు 2015 నాటికి ప్రపంచంలో 150 కోట్ల మంది కొత్తగా ఊబకాయాలతో తిరుగుతుంటారట. ఒక్క అమెరికాలోనే 'స్లిమ్' చికిత్సలకు ఏడాదికి 14700 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తున్నారు. వారి ఆహార వ్యవహార దురలవాట్లు ప్రపంచానికి అంటించారు. అమెరికా, ఐరోపాలలో గరిష్టంగా జనం ఊబకాయాలు తెచ్చుకున్నందువల్ల 'స్లిమ్' కంపెనీలు ఆసియావైపు దృష్టి సారించాయి. స్లిమ్ సోనా బెల్టుల వంటి కొత్త పరికరాలు 2005లో మన దేశ మార్కెట్‌లో కేవలం ఐదింటిని ప్రవేశపెట్టగా 2008లో 22, గతేడాది 51కి పెరిగాయి. అందుకే టీవీలలో పెద్ద మొత్తాలను ఖర్చు చేసి పెరిగిన బరువు, పెరిగిన కొవ్వును ఎలా తగ్గించుకోవచ్చో ప్రత్యేక ప్రదర్శనల ద్వారా జనానికి ఈ కంపెనీలు నేర్పుతున్నాయి. ఇదే కాలంలో ప్రపంచ మార్కెట్‌లో వచ్చిన నూతన పరికరాలు 2005లో 375 ఉంటే గతేడాది 1,528కి పెరిగాయి. ఈ పరికరాలు నిజంగా కొవ్వును కరిగిస్తే మరి అమెరికా, ఐరోపా దేశాలలో రోజురోజుకూ ఊబకాయాలు ఎందుకు పెరుగుతున్నట్లు?

- సత్య

సీరియల్

వియత్నాం గెరిల్లా

(5వ భాగం)

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

జరిగినకథ:

హావ్ భర్త ఇంటికి వస్తాడు. అయితే ఆ సమయానికి ఆమె ఓ సైనికుడి భార్యకు పురుడు పోయడానికి వెళ్తుంది. వచ్చేసరికి తండ్రి, పాప తో కబుర్లు చెప్పి నిద్రపోతాడు. ఎందుకో హావ్ అర్ధరాత్రిపూట వచ్చినా అతనికెదురు పడలేకపోతుంది. అలా బయటికెళ్లి వలలమీద పడుకొని నిద్రపోతుంది. తెల్లారి లేచేసరికి భర్త తనకెదురుగా కూర్చుని వుండడం చూసి ఆశ్చర్యపోతుంది. అతను ఆమెతో ఎన్నో కబుర్లు చెప్తాడు. జరిగిన ఘోరం గురించి ప్రస్తావిస్తాడు. ఆమెకు ధైర్యం చెబుతాడు. శత్రువులకు వ్యతిరేకంగా పనిచేయమంటాడు. పాపను బాగా పెంచమని మాట తీసుకుంటాడు. పాపకు థై అని పేరు పెడతాడు. అయితే అతను తిరిగి వెళ్లే సమయం ఆసన్నమౌతుంది... ఆ తర్వాత...

అతను మాట్లాడడం ఆపేశాడు. ఆ చీకట్లో అతని కళ్లను చూడడానికి ప్రయత్నించాను. నెమ్మదిగా 'సరే' అన్నాను. అదేమీ ఒడంబడిక కాదు. సమాజం పట్ల నా విద్యుక్త ధర్మం, వాగ్దానం. నా హృదయం సంతోషంతో పరవళ్లు తొక్కింది. అదే సమయంలో ఆదుర్దా కూడా ఎక్కువైంది. "నేను అనాథను, అతని భార్యను కావడం అదృష్టం. ఆయన రుణం తీర్చుకోవడానికి శక్తి కొలది పనిచేయాలి" అని నాలో నేను నిర్ణయించుకున్నాను. చీకటి పడింది. పాపను ఆయన ఎత్తుకున్నాడు. సంచి పుచ్చుకుని ఆయనతో పాటు సముద్రం ఒడ్డుకు బయలుదేరాను. ఇంటి గేటు దగ్గరే మామయ్య కొడుక్కి వీడ్కోలు చెప్పాడు. తండ్రి కన్నీళ్ల పర్యంతం కావడం చూసి "నాన్నా! నిత్యం కళ్లల్లో మందు వేసుకోవడం మర్చిపోకు. అయిపోతే కోడలితో చెప్పు, తెచ్చిపెడుతోంది. శాలువా తీసి పాపకు కప్పాను. నావ కోసం ఎదురు చూస్తూ రాతి బండ మీద కూర్చున్నాం. అలలు లేచిపడుతున్నాయి. శబ్దం చేస్తున్నాయి. లేత ఊదా రంగులో ఉన్న చిన్న దీవి వంక చూపిస్తూ "అది తిమింగలం దీవి. చిన్నప్పుడు ఒకసారి నాన్నతో కలిసి ఆ దీవి వద్దకు వెళ్లాను" అని చిన్ననాటి సంగతి చెప్పాడు.

ఆయన చెప్పిన విషయం వింటూ ఆ దీవి వంక చూశాను. మంచుతో కప్పబడి ఉంది. త్వరలో ఇద్దరం విడిపోతున్న విషయం గుర్తుకు రాగానే విచారం కలిగింది. ఈ విషయం ఆయన కూడా అర్థం చేసుకున్నాడు. ఒక చేతిలో పాపను పట్టుకుని నన్ను దగ్గరకు తీసుకున్నాడు.

"నేను వెళ్తున్నాను. కొంతకాలమైన తర్వాత తిరిగి వస్తాను. అప్పటి వరకు ధైర్యంగా వుంటావా?" అని అడిగాడు.

ఆ రెండు మాటలే అన్నది. ఆ సమయంలో 'హీప్'లో వైపు నుండి నావ ఒకటి మావైపు వస్తోంది. తలెత్తి చూశాను. ఒడ్డుకు చేరుతోంది. "ఎవరక్కడ? 'ఖావ్'ఏనా?" అని నావ నుండి కేక వినపడింది.

"అవును వున్నాను" అని ఆయన సమాధానమిచ్చాడు.

ఇద్దరం లేచి నిలబడ్డాం. పాప ముఖం వంక చూశాడు. పాప ఆయన చేతుల్లో హాయిగా నిద్రపోతోంది. నెమ్మదిగా ముద్దు పెట్టుకుని నా చేతికిచ్చాడు. సంచి ఆయన చేతికిచ్చాను. నావ ఒడ్డుకు చేరింది. నన్ను ఒకసారి గట్టిగా కౌగిలించుకుని నావ వద్దకు పరిగెత్తాడు. "హావ్' అత్తయ్యేనా?" అని బాంగ్ నావ నుండి అడిగాడు.

"అవును" అన్నాను.

"ఇక్కడి దాకా వచ్చావన్నమాట. పాపను ఇంటికి తీసుకెళ్లు మంచు పడుతోంది. నీ ఆరోగ్యం అంత మంచిది కాదు" అన్నాడు.

"సరే"

నేను చెప్పిన సమాధానం ఆయన విన్నాడో లేదో నావ నెమ్మదిగా వెళ్లిపోయింది. పాపనెత్తుకుని, సాగిపోయే నావ వంక చూస్తూ బండవద్దే నిలబడ్డాను. ఆయన కూడా మా వంక చూస్తున్నట్లు, చేయి వూపుతున్నట్లు కనపడింది. ఇప్పుడు ఆయనను గురించి తలచుకున్నప్పుడల్లా అలలపై ఉయ్యాల వూగుతూ మంచులో కనుమరుగైపోయిన ఆ నావ దృశ్యం గుర్తుకొస్తూ వుంటుంది.

4

"విషయమంతా విన్నావ్! ఏమంటావ్? అడిగింది 'దువాంగ్'. ఆమె జిల్లా మహిళా సంఘ కార్యదర్శి. ఆ మాటలు చెప్పి నా సమాధానం కోసం ఎదురు చూస్తోంది.

ఆమె కళ్లల్లో ఆశ, ప్రేమ తొణికిసలాడుతున్నాయి. పాపను ఎత్తుకుని బలహీనంగా వున్న తన వక్షానికి హత్తుకుంది. చిన్ని గడ్డాన్ని సవరించింది. ఆమె చేతికి నాలుగు వేళ్లు లేవు.

"నీవు చెప్పింది చేయడానికి సిద్ధమే. అయితే పాపను చూసేందుకు ఎవరూ లేరు. పైగా గర్భవతిని. ఇప్పటివరకూ ప్రసవ సమయంలో ఇతరులకు సహాయం చేస్తూ వచ్చాను. ఇక ముందూ చేస్తాను. దీనిని గురించి మీరు ఏమనుకుంటున్నారో చెబుతారా..?"

నేను అయిష్టంగా వున్నట్లు గమనించి, "ఏమిటి? చెప్పు" అంది.

ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని "మామూలుగానే ప్రసవ సమయంలో ప్రజలకు సహాయం చేస్తూనే వుంటాను. అయితే, కొత్త బాధ్యత స్వీకరించడానికి కొంత ఆలస్యమౌతుంది.

ప్రసవించిన తరువాత సిద్ధమే" అని నేను అంగీకరించడంతో 'దువాంగ్' కళ్లు మెరిశాయి.

గట్టిగా నా చెయ్యి ఊపుతూ "అయితే చేస్తావన్నమాట!నిజంగా?" అంది.

"వాగ్దానం చేశానుగా"

తన అవిటి చెయ్యి నా భుజం మీద వేసి సంతోషంతో "అంగీకరించావ్. అదే చాలు. ఇంక రాబోయే పురిటిని గురించి ఆందోళన చెందకు. అందరి మాదిరిగానే నీవు కూడా నీ పురిటిని గురించి ఆలోచిస్తున్నావ్. సహజమే. మనకు అప్పగించిన బాధ్యత ఒక్కనాటితో పూర్తి అయ్యేది కాదు. చాలా కాలం పడుతుంది. శత్రువు ఆక్రమించిన ప్రాంతంలో పని చేసేటప్పుడు అన్నీ నీకే తెలుస్తాయి. ప్రజల్లో వున్న అనుమానాల్ని మొదట తొలగించాలి. అప్పుడు గానీ వారి ప్రేమ చూరగొనలేము. స్నేహం ఏర్పడిన తర్వాత గానీ మన మీద విశ్వాసం కలగదు. అంతవరకు ప్రచారం సాగించలేము..." అంది.

"దువాంగ్" చెప్పిన మాటలు నాలో ఆందోళన రేకెత్తించాయి. తలూపుతూ, "నాకు సంగతులేమీ తెలియవు. ప్రచారం ఎలా చేయగలను?" అన్నాను. ఆమె నవ్వింది. నాలో ఆదుర్దా మరింత ఎక్కువైంది.

"ఆ పని మాత్రం నాకు అప్పగించకు. మంత్రసానిగా పని చేస్తాను. అందుకు ప్రజలు మనపట్ల ప్రతిఘటన, ఉద్యమం పట్ల సానుభూతి చూపిస్తే అదే సరిపోతుంది. వాళ్లకు అదీ, ఇదీ చెప్పాలంటే నా వల్ల కాదు", అని చెప్పాను.

"దువాంగ్" నవ్వు ఆపింది. ముఖంలో గంభీరత ఆవరించింది. నరాలు బిరుసెక్కాయి. ముఖకవళికల్లో మార్పు వచ్చింది. "త్వరపడి ఆ విషయాలు నాకు చెప్పానేమో" అని భావిస్తున్నట్లుగా కనపడింది.

"ఆదుర్దాపడకు. అనుభవంలో నీవే తెలుసుకుంటావు. నాకూ మొదట్లో ఏమీ తెలియదు. అందువల్ల దాని గురించి భయపడకు. అలవాటు పడతావు" అంది.

"నిన్ను నమ్ముతున్నాను"

ఆ మాటతో ఆమె మరింత ఆనందపడి నా చేతులు గట్టిగా నొక్కింది. సముద్రం వంక చూస్తూ, "పీలోకాండోర్'లో ఎందుకుంటున్నానో నీకు తెలుసా?" అని అడిగింది.

"డాంగ్‌హాంగ్' జిల్లాలో పన్నులకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనల్లో నువ్వు పాల్గొన్నావు. అరెస్టు అయ్యావు"

"కాదు, అందుకు కాదు. అప్పుడు వాళ్లు నన్ను అరెస్టు చేయలేదు. నా కార్యక్రమంలో అదొక చిన్న కథ మాత్రమే. ప్రధానంగా స్త్రీలు ఎక్కువ ఓర్పు పట్టాల్సి వుంటుందని తెలియజేయడానికే"

'దువాంగ్' చెప్పిన మాటలకు నా శరీరం కంపించింది. దుఃఖం పొర్లుకొచ్చింది. కళ్లు

నా శరీరం కంపించి పోయింది. చెమటలు పోశాయి. పాదాలు భూమిలోకి దిగిపోతున్నట్లుగా వున్నాయి. ఉత్తరం చదవాలని ఆదుర్దాపడ్డాను. నాకు తెలియకుండానే పెద్దగా అరిచాను. మాట రావడం లేదు. స్పృహ తప్పిపోయింది. ఏదో ప్రమాదం జరిగిందని 'దువాంగ్' నా దగ్గరకు పరుగెత్తుకొచ్చింది. నా చేతిలో ఉత్తరం తీసుకుని ఒకటికి రెండు సార్లు చదివింది. మౌనంగా నావంక చూసి, నెమ్మదిగా నాభుజం తట్టింది. తలపైకెత్తాను. నాకేమీ వినిపించడం లేదు.

చెమ్మగిల్లాయి. ఆమె ఇంకా చెబుతూనే వుంది.

"విప్లవం కొనసాగించాలంటే కష్టాలు భరించాల్సి వుంటుంది. ఇంటివద్ద మనం పడే కష్టాలకంటే చాలా తీవ్రంగా కూడా వుంటాయి. ఒక్కొక్కప్పుడు ఎవరికీ తెలియకుండానే చనిపోవచ్చు కూడా. ఎంతబాధ పెట్టినా నోరు విప్పకుండానే, రక్తం ధారబోయవలసి రావచ్చు"

మాటలు మధ్యలోనే ఆపి తిరిగి సముద్రం వంక చూసింది. కొంత సేపటికి నా వైపు తిరిగి, పాప తలను తన చెక్కిళ్లకు హత్తుకుంది. ఆమెను చూడగానే నా హృదయంలో భారం తగ్గింది. రెండు సంవత్సరాల క్రితం ఆమెతో పరిచయం ఏర్పడింది. ఆమెను కలుసుకున్నప్పుడల్లా, నిజమైన సోదరిని ఆమెలో చూడగలిగే దానిని. ఎంతో స్నేహ పాత్రురాలు. ఆమె చెప్పిన మాటలు నన్నెంతో కలవరపరిచేవి. స్త్రీలు ఎన్నో బాధలు పడ్డారనే సంగతి నాకు చాలా కాలం కిందటే తెలుసు. వాటి నుండి విముక్తికి యువకుల మీద ఆశపెట్టుకునే వాళ్లమేగానీ, తమ కృషిద్వారా తమ విముక్తి సాధించుకోవచ్చనే విషయం ఎప్పుడూ ఆలోచించలేదు. "దువాంగ్" భుజమ్మీద చెయ్యివేసి నిలబడిపోయాను.

సాయంకాలం అవడం గమనించి "జిల్లా కేంద్రానికి ఎప్పుడు వెళ్తారు?"అని అడిగాను.

"ఇప్పుడు వెళ్తున్నాను"

"ఇక్కడ వుండి నాతో భోజనం చెయ్యి" అని అన్నాను. 'దువాంగ్' అంగీకరించింది.

"పాపను కిందకు దించు, ఆడుకొంటుంది" అని చెప్పి వంట చేయడానికి లోనికి వెళ్లాను.

కొంచెం సేపైన తర్వాత తనూ వంటింట్లోకి వచ్చి కూర్చుంది. ఏదో గుర్తుకు వచ్చినట్లుగా 'బే' ఎక్కడ? అడిగింది.

"లాంగ్‌హాంగ్" వెళ్లాడు.

అతని కళ్లు ఇప్పుడు ఎలా వున్నాయి?"

"అంత బాగా లేవు. గాలి వీచినప్పుడు మంటపుడుతున్నాయట"

'దువాంగ్' తన బ్యాగులో నుండి చిన్న సీసా తీసి, నా చేతికిచ్చింది.

"ఆయన కోసం ఇది కొనుక్కొచ్చాను. రాత్రిళ్లు పడుకోబోయేటప్పుడు ప్రతిరోజూ రెండు కళ్లల్లోనూ ఒక్కొక్క చుక్క వెయ్యి" అని చెప్పింది.

అందుకు కృతజ్ఞతలు తెలియజేశాను. ఆ సమయంలో ముందు వాకిట్లో అడుగుల చప్పుడు వినిపించింది.

"హావ్' ఎక్కడున్నావ్? పాప మట్టిలో ఆడుకుంటుంటే ఏం చేస్తున్నావ్?" అన్న మాటలు విన్పించాయి.

'బాంగ్' గొంతు గుర్తుపట్టి వెంటనే "ఇక్కడే వున్నాను" అన్నా.

"నీకొక వుత్తరం వచ్చింది"

ఆదుర్దాతో బైటకు పరుగెత్తాను. 'బాంగ్' ఉత్తరం నా చేతికిచ్చాడు. థాంక్స్ చెప్పి "వెళ్లేముందు భోజనానికి మా ఇంటికి రా" అన్నాను.

"భోజనం చేశా. ఇప్పుడే వెళ్లాలి. అర్జంటు పని వుంది" అని చెప్పి వెళ్లిపోయాడు. కవరు మీది దస్తూరి చూసి, నా భర్త దగ్గర నుండి వచ్చిందని గుర్తించాను. ఆయన వున్న దళం వారు పంపించి వుంటారనుకుంటూ, కవరు చించి

"ఆశ్చర్యంగా వుంది. ఈ వుత్తరం ఆయన దళం వారు పంపారు" అన్నాను దువాంగ్‌తో.

"ముందు వుత్తరం చదువు"

ఉత్తరంలో రెండు లైన్లు చదివానో లేదో ఉలిక్కిపడ్డాను.

"శ్రీమతి ఎన్‌గుయెన్ థైహావ్, మా కంటే నీకు మరింత బాధ కలిగిస్తుందన్న వుద్దేశ్యంతో నీకు ఈ వుత్తరం పంపడానికి తటపటాయించాం. అయితే జరిగిన దానిని నీ నుంచి దాయలేం. నిబ్బరంగాను, ధైర్యంగాను వుండమని ప్రార్థిస్తున్నాం"

నా శరీరం కంపించి పోయింది. చెమటలు పోశాయి. పాదాలు భూమిలోకి దిగిపోతున్నట్లుగా వున్నాయి. ఉత్తరం చదవాలని ఆదుర్దాపడ్డాను. నాకు తెలియకుండానే పెద్దగా అరిచాను. మాట రావడం లేదు. స్పృహ తప్పిపోయింది. ఏదో ప్రమాదం జరిగిందని 'దువాంగ్' నా దగ్గరకు పరుగెత్తుకొచ్చింది. నా చేతిలో ఉత్తరం తీసుకుని ఒకటికి రెండు సార్లు చదివింది. మౌనంగా నావంక చూసి, నెమ్మదిగా నాభుజం తట్టింది. తలపైకెత్తాను. నాకేమీ వినిపించడం లేదు. దువాంగ్ ఉత్తరాన్ని బిగ్గరగా చదవసాగింది.

(ఇంతకీ ఆ ఉత్తరంలో ఏముంది? దాన్ని చూసి హావ్ ఎందుకంతగా వణికిపోయింది?)

(ఇంకా వుంది)

నవ్వుల్ - పువ్వుల్

ఎంపైర్

రాము : క్రికెట్ ఆడేవాళ్లకు కళ్లు కనపడకపోతే వారిని ఏం చేస్తారు సార్?
టీచర్ : ఎంపైర్‌గా నియమిస్తారు.

పూరీలు

అమ్మ : పెరిగే వయసులో వున్నావు. 11సంవత్సరాలకు 5 పూరీలు కూడా తినకపోతే ఎలారా?
కొడుకు : 11 సంవత్సరాలకు 5 పూరీలు తినమంటున్నావు. మరి అరవయ్యేళ్ల నానమ్మకు మాత్రం రెండు పూరీలే ఎందుకు పెడుతున్నావ్?

ముట్టను

రమేష్ : కట్నం ముట్టనని ప్రామిస్ చేశావ్. ఇప్పుడెలా తీసుకున్నావ్?
సురేష్ : నేనేమీ ముట్టుకోలేదు. నా పేరుతో బ్యాంక్‌లో వేయించుకున్నాను అంతే.

ఊరికే....

భర్త : ఇప్పుడు చీరలు ఎందుకు కొన్నావ్?
భార్య : ఊరికే ఇవ్వరు కనుకే కొన్నాను.

ప్రేమ

సుబ్బారావు : మా అత్తగారంటే నాకు అమితమైన ప్రేమ.
అప్పారావు : నెలకు సరిపడా అన్నీ కొనిపెడుతుంటావా?
సుబ్బారావు : కాదు. ఓల్డేజి హోంకు వెళ్లి చూసొస్తుంటానంతే.

ఎలా?



టీచర్ : పరశురాముడికి ఆపేరు ఎలా వచ్చింది?
విద్యార్థి : బహుశా పర్సులు ఎక్కువగా కొట్టేసేవాడేమో సార్!

చూశా

అనిల్ : పొద్దున్నే లేచి ఆ నల్లపిల్లిని చూశాను. ఏమౌతుందో ఏమో.
సునిల్ : అయ్యో పాపం.. నువ్వు చూశావా? పాపం ఆ పిల్లి ఇప్పుడే బస్సు కిందపడి చచ్చిపోయింది.

ఎలుకలు

బిచ్చగాడు : కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. ఒక రూపాయి ఇవ్వండి సార్?
ఆసామి : ఓరి నీ అమాయకత్వం కానూ... రూపాయికి ఏ ఎలుకల మందూ రాదు.

జాతీయ సంపద

మాస్టర్ : మన జాతీయ సంపద ఎక్కడుందిరా రాజు.
రాజు : స్విస్‌బ్యాంకులో సార్.

ఎమ్.ఎల్.నారాయణ

క్రైమ్ కథ

ఆమె అందించిన క్లూ

- యర్నాగుల సుధాకరరావు

"నేను నీరజ అన్నను. మా అమ్మ చనిపోయిన దుఃఖంలో ఉన్నాను. మా అమ్మ మమ్మల్ని ఎంతో గారాబంగా పెంచింది" అని చెబుతుంటే నీరజ నిశ్చేష్టురాలైంది. "మిమ్మల్ని ఎక్కడో చూశాను. అదే ఎక్కడ?"

నీరజ తల్లి వారం రోజులుగా మృత్యువుతో పోరాడి కూతురి ఒడిలోనే మరణించింది. నయంకాని జబ్బు ఆమెను కబళించింది. నీరజ కొద్దిసేపు ఒంటరిగా ఆ ఇంట్లో ఏడ్చింది. ఇలా తాను ఏడుస్తూ కూర్చుంటే కాదు. వెంటనే అన్నయ్యకు చెప్పాలి. వాడు ఏ విషయంలో రాకపోయినా చావుకు రాకతప్పదు. మెల్లగా లేచి తల్లిశవాన్ని మంచం మీద అలానే ఉంచేసి ఇంటికి తాళంవేసి దగ్గర్లో యస్‌టిడి బూత్‌కి వెళ్లింది. దారి పొడుగునా ఆమె కళ్లు వర్షిస్తూనే ఉన్నాయి. ఒంటరితనంతో ఇక తాను బతుకుబాటలో ఈదాలి. పెద్దదిక్కుగా ఉన్న తల్లి లేకుండా పోయింది. అన్న పట్టించుకోడు. భర్త చెప్పాపెట్టకుండా ఎటోపోయాడు. తన జీవితం తెగిన గాలిపటం అని ఆ ఏడుపులో కూడా నవ్వుకుంది.

అప్పటికే బూత్ వచ్చేసింది. లోపల ఆగంతకుడు మాట్లాడుతున్నాడు. చాలాసేపటికిగాని రాలేదు. అతడి చేతిలో పగిలిపోయిన సెల్ ఉంది. దాన్ని మరింతగా నలిపేస్తు డస్టుబిన్‌కేసి కొట్టేసి వెళ్లిపోయాడు. బూత్‌లోకి నీరజ వెళ్లగానే ఫోన్ మోగింది. అక్కడ బూత్ బోయ్ లేడు. తానే రిసీవర్ ఎత్తింది.

"ఏయ్ యానిమల్! బుద్ధి ఉందా! ఖూనీ చేశాక శవాన్ని జీపులో పడేసి చేతులు దులుపుకుంటూ పోతావా? నీ కోపం వల్ల అంతా పాడైంది. చేతిలోని సెల్‌ను పగలకొట్టుకున్నావు. నీతో టచ్‌లో ఎలా ఉండగలం. మేం పక్కసందులోంచి జీపును తీయలేదు. నువ్వు వస్తే గాని జీపు కదలదు. ముందు వచ్చేయ్" ఆ మాటలు విని నిర్ఘాంత పోయింది. వెంటనే పోలీసులకు తాను విన్నది చెప్పేసింది.

"ఎవరు మాట్లాడుతున్నది నీరజలా ఉంది. ఇదేమిటి మీ పత్రికాఫీసు నుంచి ఫోన్ కాదు, యస్‌టిడిబూత్‌లోంచి ఇంత రాత్రివేళ" అని యస్‌ఐ అడిగాడు. ఏదో బదులు చెప్పేసి తన అన్నకు తల్లి చావుకబురు చెప్పింది. అతడు వస్తానన్నాడు. మరికొందరు బంధువులకు, స్నేహితులకు చెప్పుకుంది. అప్పటికే పోలీసుల వ్యాన్‌లు రెండు తన ముందునుంచే దూసుకుపోయాయి.

నీరజ ఇంటికి వెళ్లాక నైట్‌డ్యూటీలో ఉన్న పత్రికా సిబ్బంది వచ్చేసి తమవంతు సాయం చేశారు. మరుసటిరోజు అన్న రాలేదు. ఆమెకు ఇరుగుపొరుగువారు సాయం చేయడంతో తల్లికి చేయాల్సినవన్నీ జరిగిపోయాయి. ఆ సాయంత్రం అన్న రానేవచ్చాడు. తల్లి ఎలా చనిపోయింది చెప్పినా ఆసక్తిగా విననేలేదు. ఏదో వచ్చాను ఇక వెళ్తాను అన్నట్టుగానే కొంతసేపు ఆ ఇంట్లో ఉన్నాడు. అతణ్ణి ఎవరూ ఏమీ అడగలేదు.

పోలీసులు వచ్చారు. రాత్రి నైట్‌డ్యూటీలో ఉన్న యస్‌ఐ నీరజను కలుసుకుని పరామర్శించాడు. "నీవు తల్లి చనిపోయిన దుఃఖంలో ఉన్నా హంతకుల క్లూ అందించావు. వెంటనే శవంతో సహా హంతకులను పట్టుకున్నాం" అని చెప్పాడు. ఈ సిటీ నుంచి ఏమాత్రం దాటిపోయినా మనకు చిక్కేవారు కాదని చెప్పాడు.

"నేను పనిచేసిన పత్రికాఫీసులో కంప్యూటర్‌లో ఫాస్టువార్తలను కంపోజ్‌చేయడం, లాస్టు అవర్‌లో న్యూస్ ఐటమ్స్‌పై ఉత్కంఠ నాకు కొత్తకాదు. అందుకే నా చెవిన పడిన వెంటనే నేను మీకు చెప్పాను. ఇందులో నేను చేసిందేమీ లేదు. ఇంతకీ హత్యకు గురైనవారెవరు?"

సిటీలో రియల్‌ఎస్టేటు వ్యాపారి జోగిందర్. తోటివ్యాపారులతో గొడవల కారణంగా కిరాయిహంతకులతో చంపించారు. దొరికిన హంతకులు ఏదీ దాచకుండా చెప్పారు. చంపించిన వారికోసం వెతుకుతున్నాం. అన్నట్టు ఈయన ఎవరు? నీకేమవుతాడు?" నీరజ అన్నను చూసి అడిగాడు.

"నేను నీరజ అన్నను. మా అమ్మ చనిపోయిన దుఃఖంలో ఉన్నాను. మా అమ్మ మమ్మల్ని ఎంతో గారాబంగా పెంచింది" అని చెబుతుంటే నీరజ నిశ్చేష్టురాలైంది.

"మిమ్మల్ని ఎక్కడో చూశాను. అదే ఎక్కడ?"

"చూసి ఉండరు సార్. ఎందుకంటే నేను సిటీలో ఫైనాన్సు వ్యాపారి వద్ద పనిచేసుకుంటున్నాను. అది ఆఫీసువర్కు. అన్నట్టు నీరజా ఈరోజు ఏమేమి కావాలో లిస్టు తయారుచేయ్" అని ఆమెకు పని పురమాయించాడు. నీరజకు ఎందుకో అన్న పడుతున్న కంగారులో ఏదో అనుమానం. యస్‌ఐ కూడా అదోలా అయిపోయి ఏదో గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నాడు. వెంటనే టీవీ ఆన్ చేశాడు. ఒక ఛానెల్‌లో జోగిందర్ హత్య, హంతకులను పోలీసులు పట్టుకున్నట్టు చూపారు. జోగిందర్‌ను కిరాయి వారితో చంపించే వారికోసం వెతుకుతున్నారని ముగ్గురు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫొటోలు చూపారు. అందులో నీరజ అన్న కూడా ఉన్నాడు. నీరజ లిస్టు రాస్తూ ఆ ఫొటో చూసి అన్నవైపు చూసింది.

యస్‌ఐ టీవీలోంచి దృష్టి మరల్చి "ఇదిగో నేనే మీడియాకు ఈ ఫొటోలు రిలీజ్ చేశాను. ఈ ఫొటోలోనే ఈతన్ని చూశాను. మేం వెతుకుతున్న ముగ్గురిలో ఒకడు" అని నీరజ అన్న చేయి పట్టుకున్నాడు.

"సార్ మా అమ్మ చనిపోయిన దుఃఖంలో ఉన్నాం. ఇప్పుడు అరెస్టు చేయవద్దు" అని ప్రాధేయపడింది నీరజ.

"ఆమె అంత్యక్రియలు కూడా అయిపోయాయి. ఇక ఈతడు ఇక్కడ చేయాల్సిన వాటికోసం వేరేవారిని వెతుక్కోండి. నీవే హంతకులను పట్టించావు కనుక నీ మాటమీద గౌరవముంచి ఇతణ్ణి వెంటనే కోర్టులో పెట్టేస్తాను. మీరు తల్లిపోయిన విషయం చెప్పి బెయిల్ పెట్టుకోండి. కనీసం కండిషన్ బెయిల్ వస్తుంది" అని చెప్పి అరెస్టు చేశాడు.

అక్కడే ఉన్న పలువురు "నీవేనా హంతకులను పట్టించావు. ఇప్పుడు ఇంటికి రాకరాక వచ్చిన అన్నను పట్టులో పిట్టలా పట్టించావు. ఈ కార్యక్రమం ఎవరు చేస్తారు" అని నిలదీశారు.

"అన్నా ఏమిటిదంతా! నువ్వు జోగిందర్ హత్యలో ఉన్నావా?"

"కిరాయికి కుదిర్చినవరకు ఉన్నాను. కానీ, ..."

"మరేం చెప్పకు. నీకు రెక్కలు రాగానే నన్ను, తల్లిని వదిలిపోయావు. ఏనాడూ ఇటువైపు చూడలేదు. తప్పుడు పనులు చేస్తూ తప్పుడు మార్గాల్లో పయనించావు. ఇప్పుడు ఏకంగా ఖూనీ కేసులో ఉన్నావు. చంపేటంత తప్పు వ్యాపారంలో ఏమిచేశాడు ఆ జోగిందర్?"

"నీరజ అలా అడగాల్సింది నీవు కాదు. నేనే ఆ ప్రశ్న అడగాలి" అని యస్‌ఐ ఇటు తిరిగాడు.

"జోగిందర్ మొదట్నుంచీ మోసగాడు. స్థల వివాదాల్లోకి మమ్మల్ని పీకలోతుల్లోకి కూరేస్తుండేవాడు అందుకే వాడి పనిపట్టాలని అనుకున్నాం. చచ్చూరుకున్నాడు. వాడిమీద పోలీసు కేసులు చాలా ఉన్నాయి. వాడు క్రిమినల్" అని చెప్పాడు.

"అన్న చేయించిన ఖూనీని, ఖూనీకోరలను చెల్లెలు పట్టించింది" అని పరామర్శకు వచ్చినవారు పదేపదే చెప్పుకున్నారు.

★

చూద్దామా

అద్భుత శిల్పాల ఝరి... అమరావతి

భిన్న సంస్కృతులు, ఆచారాలు, వ్యవహారాల సమ్మేళనం మన భారతదేశం. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు కలసిమెలసి సహజీవనం సాగించే భూమి ఇది. మనదేశంలో పుట్టి ఇతర దేశాలకు వ్యాప్తి చెందిన బౌద్ధమతానికి చెందిన పుట్టుపూర్వోత్తరాలు, బుద్ధం శరణం గచ్ఛామి అంటూ జ్ఞానబోధ చేసిన సిద్ధార్థుడి జీవిత సంఘటనలను వివరించే ప్రాంతాలు దేశంలో అనేకం ఉన్నాయి. వాటన్నింటిలోకి ప్రముఖమైనది....శిల్పకళా వైభవానికి తార్కాణంగా నిలిచింది...అమరావతి. ఇక్కడి శిల్పాలు బుద్ధుని జీవిత సంఘటనలను వివరిస్తూ ఆయన జాతక కథలతో మతపరమైనవిగా కనపడ్డప్పటికీ ఆనాటి కాలంలో సుఖ సంతోషాలతో గడిపిన ప్రజల జీవితాన్ని, నాటి సామాజిక నైజాన్ని కళ్లకు కట్టినట్లుగా వివరిస్తున్నాయి. శిల్పాలను నిశితంగా పరిశీలిస్తే మనిషిలోని ప్రేమ, వాత్సల్యం, దయ, గర్వం, ఆగ్రహం, భయం, విషాదం మొదలగు భావోద్వేలు గోచరిస్తాయి. నాటి ప్రజల వస్త్రధారణ, కేశాలంకరణ, ఆభరణాలు, వస్తుసామాగ్రి, ఇళ్లు, రవాణా సౌకర్యాలు, కోటగోడలు, భవనాలు, మంటపాలు, ప్రాకారాలు, పడవలు, జంతువులు మొదలైనవాటిని తమ అద్భుత శిల్పకళా నైపుణ్యంతో ఆనాటి శిల్పులు అందంగా మలిచారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న అమరావతి సుమారు వెయ్యి సంవత్సరాలపాటు బౌద్ధ మతానికి, శిల్ప సంప్రదాయాలకు నిలయమైంది.

ప్రస్తుతం ఉన్న అమరావతి ఒకప్పుడు అనేక బౌద్ధ ఆరామాలతో నిండి ఉండేదని, అందువల్ల ఈ ప్రాంతానికి 'ఆరామావతి' అనే పేరు వచ్చిందని...అది కాలక్రమేణా 'అమరావతి'గా మారిందని ఇక్కడి శాసనాలనుబట్టి తెలుస్తోంది. ఇక్కడ ఉన్న అమరలింగేశ్వర దేవాలయం వల్లనే ఈ పట్టణానికి అమరావతి అనే పేరు నిలిచిపోయిందని మరోగాథ ప్రచారంలో ఉంది. నాటి ధాన్యకటకంలో భాగమే నేటి అమరావతి.

గుంటూరు జిల్లాలో ఉన్న అమరావతి గుంటూరు పట్టణానికి 35 కిలోమీటర్ల దూరంలో కృష్ణానది తీరాన ఉంది. అమరావతి పురావస్తు ప్రదర్శనశాలలో ఉన్న పలు శాసనాలు, పట్టణ చరిత్ర చెప్పే పలు గ్రంథాల్లో పేర్కొన్నదాని ప్రకారం....నేటి అమరావతి పట్టణం ఒకనాడు వర్తక, వాణిజ్యాలకు నిలయమైన ధాన్యకటకంలో ఒక భాగంగా ఉండేది. క్రీస్తు పూర్వం నుండే వివిధ రాజవంశీయులు ధాన్యకటకాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలన సాగించారు. మొదట నాగ, యక్ష తెగలకు చెందిన వారు ఈ ప్రాంతాన్ని పాలించారు. క్రీ.శ.3వ శతాబ్దంలో ఈ ప్రాంతం మౌర్య సామ్రాజ్యాధీశుడు అశోకుడి పరిపాలనలో ఉంది. క్రీ.శ.1వ శతాబ్దంలో సద వంశీయులు, ఆ తర్వాత వరుసగా శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, శాలంకాయనులు, ఆనంద గోత్రజులు, చాళుక్య రాజులు, చోళులు, కోట వంశీయులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర పాలకులు, కుతుబ్‌షాహీ నవాబుల ఏలుబడిలో ఈ రాజ్యం ఉంది. క్రీ.శ.3వ శతాబ్దంలో ధాన్యకటకాన్ని పరిపాలించిన అశోకుడు అమరావతిలో ఉన్న బౌద్ధ చైత్యానికి రాతి ప్రాకారం నిర్మించాడు.

సారవంతమైన కృష్ణాది పరీవాహక ప్రాంతం కావటంతో ధాన్యకటకంలో పత్తి, వరి మున్నగు పంటలు విరివిగా పండేవి. అందువల్ల పారిశ్రామిక వర్తక, వాణిజ్య రంగాలకు ఈ ప్రాంతం మారుపేరుగా నిలిచింది. ఇక్కడి నుండి వరి, పత్తి, అటవీ, జంతు ఉత్పత్తులను, సంపదలను కృష్ణానది ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేసుకునేవారు. ఇతర ప్రాంతాల నుండి తమకు కావాల్సిన వాటిని దిగుమతి చేసుకునేవారు. వాణిజ్యానికి రహదారులు కూడా అవసరమని భావించిన ఆనాటి రాజులు, ప్రజలు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి రహదారులను ఏర్పాటు చేసుకున్నారు. ధాన్యకటకానికి పశ్చిమదిశలో ఉన్న ప్రతిష్టానపురం, తెలంగాణాలోని ధూళికట్ట, ఫణిగిరి, నేలకొండపల్లి, జగ్గయ్యపేట ద్వారా ఒక మార్గం, కళింగ రాజ్యం నుండి తూర్పుకోస్తా గుండా శాలిహుండం, రామతీర్థం, బావికొండ, గుంటుపల్లి, రామిరెడ్డిపల్లి, అల్లూరు ద్వారా మరో



- పద్మరాజు

ఫొటోలు : హరి





మార్గం, కర్నాటకలోని వనవాహిని, కంచి నుండి మరో రెండు మార్గాలు మొత్తం నాలుగు మార్గాలను ఏర్పాటు చేసుకున్నారు.

మరుగున పడిన మహాచైత్యం

మన రాష్ట్రంలో బౌద్ధం ఒక ఉద్యమంగా విలసిల్లిన కాలంలో ధాన్యకటకం (అమరావతి)లో బౌద్ధులు మహాచైత్యాన్ని నిర్మించారు. ఇది భారతదేశంలో అత్యున్నతమైన వారసత్వ సంపదగా ఇప్పటికీ భాసిల్లుతోంది. ఇంతటి ప్రఖ్యాతిని సంపాదించిన ఈ మహాచైత్యం క్రీ.శ.14వ శతాబ్దంలో మరుగున పడిపోయింది. నిజాం పాలనలోని మాండలికుడు వెంకటాద్రినాయుడు గృహ నిర్మాణం, పట్టణ నిర్మాణం చేపట్టినప్పుడు ధాన్యకటకంలో ఉన్న చారిత్రక కట్టడాలు, అద్భుత కళాఖండాలు ధ్వంసమయ్యాయని విన్న చరిత్రకారుడు కొలిన్‌మెకంజీ 1797లో ఈ ప్రాంతాన్ని దర్శించి విధ్వంసానికి గురైన మహోన్నత వారసత్వ సంపదను గురించిన విశేషాలను బహిర్గతం చేశారని అమరావతి చరిత్రను తెలిపే పలు గ్రంథాలను పరిశీలించినప్పుడు అర్థమవుతోంది. ఆ గ్రంథాల్లో పేర్కొన్న దాని ప్రకారం 1797 తర్వాత 1845లో సర్ వాల్టర్‌స్మిత్, 1877లో రాబర్ట్ సీవెల్, 1881లో జేమ్స్ బర్జెస్, ఆ తర్వాత అలెగ్జాండర్ రే, 1958లో డాక్టర్ రాయప్రోలు సుబ్రమణ్యం, కె.కృష్ణమూర్తి, 1962లో ఎం.వెంకటరామయ్య, కె.రాఘవాచారి, 1973లో డాక్టర్ ఇంగువ కార్తికేయశర్మ, 1990లో జి.ఆర్. గెహ్లాట్ విస్తృత పరిశోధనలు జరిపి ఈ ప్రాంతపు విశిష్టతను, మహాచైత్యం ప్రాధాన్యతను, అమరావతి శిల్పాల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పారు. 1797లో కొలిన్‌మెకంజీ పరిశోధనల వల్ల బయల్పడిన మహాచైత్యం చాలా వరకు ధ్వంసమైంది. తవ్వకాల తర్వాత మిగిలిన శిల్ప సంపద అనేక దేశాలకు చెల్లాచెదురైంది. వీటిలో 125 శిల్పాలకు పైగా లండన్‌లోని బ్రిటీషు మ్యూజియంలో ఉన్నాయి. పారిస్ మ్యూజియంలో 4, కొల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంలో 14, చెన్నై మ్యూజియంలో 350కి పైగా అమరావతి శిల్పాలున్నాయి. కొన్ని విజయవాడలో, మరికొన్నింటిని మచిలీపట్నంలో భద్రపరచగా మిగిలినవి అమరావతి మ్యూజియంలో భద్రపరిచారు.

ప్రతి శిల్పం....ఓ విజ్ఞాన సర్వస్వం

'ఈ నల్లని రాలలో ఏ కన్నులు దాగెనో...ఈ బండల మాటున ఏ గుండెలు మోగెనో' అమరశిల్పి జక్కన సినిమాలోని ఈ పాట అమరావతి శిల్పాలకు కచ్చితంగా సరిపోతుంది. చూపరుల మదిని అంతలా దోచేస్తాయి ఈ అద్భుత శిల్పరాజాలు. అమరావతి మ్యూజియంలో భద్రపరిచిన ప్రతిశిల్పం ఒక అద్భుతం. నాటి సమకాలీన సమాజానికి దర్పణంగా, విజ్ఞాన సర్వస్వానికి ప్రతీకలుగా అవి నిలుస్తున్నాయి. బౌద్ధం ప్రతిపాదించిన సామాజిక సమానత్వ భావాన్ని, విశ్వ ఉదార స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయి. ఆనాటి ప్రజలు ఎక్కువగా నగరాల్లో జీవించారని శిల్పాలను బట్టి తెలుస్తోంది. పట్టణంలోని నాగరికత వీటిలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రతి వ్యక్తి ముఖంలోనూ జీవం తొణికిసలాడటాన్ని బట్టి ప్రజలు సుఖసంతోషాలతో జీవించారని చెప్పవచ్చు. మ్యూజియంలో ఉన్న ప్రతి శిల్పంలో ఆభరణాలు ధరించి ఉండటాన్ని మనం గమనించవచ్చు. దీన్నిబట్టే వారికి నగలపై ఎంత మక్కువ ఉందో అర్థం చేసుకోవచ్చు. చెవికమ్మలు, కంఠాభరణాలు, గాజులు, గజ్జెలు ధరించిన స్త్రీమూర్తుల శిల్పాలు అబ్బురపరిచేలా ఉన్నాయి. వీటిని రూపొందించేటప్పుడు ముత్యాలు, పూసలు ఎక్కువగా వాడేవారని మ్యూజియంలో ఉన్న చారిత్రక శాసనాలు, ఆధారాల్లో పేర్కొన్నారు. అనేక శిల్పాల్లో సామాజిక సహజీవనం స్పష్టంగా గోచరిస్తోంది. ఆనాటి శ్రమైక జీవన సౌందర్యాన్ని గుర్తుచేసే విధంగా రాతి పనివాడు, శిల్పి, వ్యవసాయదారుడు, పశువులకాపరి, కుమ్మరి, నేతపనివాడు, నూనె పిండేవాడు ఇలా వివిధ వృత్తులవారి శిల్పాలు ఆలోచింపజేస్తున్నాయి.

చూడాల్సిన ప్రదేశాలు

ఇంతటి ప్రాముఖ్యం ఉన్న అమరావతిలో పైన చెప్పిన మహాచైత్యం, పురావస్తు ప్రదర్శనశాల, అబ్బురపరిచే అమరలింగేశ్వరుని దేవాలయం చూడదగ్గ ప్రదేశాలు. మహాచైత్యాన్ని దర్శించాలనుకునే వారు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు ఎప్పుడైనా వెళ్లొచ్చు. పురావస్తు ప్రదర్శనశాల ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటుంది.

★

'జ్ఞానబుద్ధుడికి' మోక్షమెప్పుడో?

బౌద్ధమతాన్ని విశ్వవ్యాప్తం చేసి, అమరావతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన తథాగతుడి భారీ విగ్రహాన్ని ఇక్కడ నెలకొల్పాలని ప్రభుత్వం భావించింది. ఈ ప్రాజెక్టుకు 'జ్ఞానబుద్ధ ప్రాజెక్టు' అని పేరుపెట్టారు. అయితే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి దాదాపు ఆరున్నర సంవత్సరాలు అవుతున్నా ఇంకా పూర్తి కాకపోవటం పర్యాటకులకు నిరాశ కలిగిస్తోంది. 28 అక్టోబరు 2003న అప్పటి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి జె.ఆర్.పుష్పరాజ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టులో భాగంగా మొదట 60 అడుగుల ఎత్తున బుద్ధుని విగ్రహాన్ని నిర్మించాలని అనుకున్నారు. ఆ తర్వాత విగ్రహం ఎత్తును 125 అడుగులకు పెంచారు. దీనికి ఇప్పటి వరకూ కోటి 60 లక్షల రూపాయలను ఖర్చు చేశారు. మరో 25 లక్షలు వెచ్చిస్తే విగ్రహాన్ని పూర్తి చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. ఇదే సమయంలో ప్రాజెక్టును సాంఘిక సంక్షేమశాఖ నుండి పర్యాటకశాఖకు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుండి వివిధ కారణాల వల్ల ఈ విగ్రహ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. వచ్చే మే 25 నాటికి (బుద్ధ జయంతి సందర్భంగా) విగ్రహాన్ని పూర్తి చేసి పర్యాటకుల ఆకాంక్షను నెరవేరుస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ భారీ విగ్రహం కింది భాగంలో బ్రిటీషు కాలం నాటి బౌద్ధ శిల్పాలతో కూడిన ఒక మ్యూజియం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 1.6 కోట్ల ఖర్చుతో ఇక్కడ పలు అతిథి గృహాలు నిర్మిస్తున్నట్లు వారు వివరించారు.



కొత్త పుస్తకాలు

స్వేచ్ఛ కోసం

ఖమ్మం కవుల శ్రీశ్రీ స్మారక కవితా సంకలనంగా దీన్ని ప్రజారచయితల సమాఖ్య ఐనాల సైదులు, గద్దపాటి శ్రీనివాస్ సంపాదకత్వంలో వెలువరించారు. 73 మంది కవులు/ కవయిత్రులు... ఈ సంపుటిలో కవితలు రాశారు. శ్రీశ్రీ స్మారక కవితా సంకలనం అంటే శ్రీశ్రీపైనే కవితలుంటాయి అనుకునే వారికి కొంత నిరాశ అనిపిస్తుంది. సంవత్సర కాలంలోనే ద్వితీయ ముద్రణకు ఓ కవితా సంకలనం రావడం అభినందనీయాంశం. ఉత్పత్తి శక్తి ఉద్యమ రూపం 'స్వేచ్ఛకోసం' అంటూ హిమజ్వాల ముందుమాట రాయగా... 'ఆత్మీయ అభినందన' అంటూ వెనుక మాట ఖమ్మం జిల్లా సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి రేతురవి రాశారు. ప్రగతిశీల సాహిత్యానికి, పోరాటోద్యమాలకు గుమ్మం ఖమ్మం. నైజాం నవాబును ఎదిరించిన భక్తకవి 'రామదాసు' తెలంగాణా సాయుధపోరాటంలో పాల్గొన్న మహాకవి దాశరథి లాంటి కవుల్ని ఇచ్చిన జిల్లా ఖమ్మం. ఈ కవితా సంపుటిలో సంపాదకులైన గద్దపాటి శ్రీనివాస్ రాసిన 'కంచికచర్ల టు ఖైర్లాంగి' (పేజీ8). 'అమ్మనవ్వాలనుంది' చివరి కవిత రాసిన సైదులు ఐనాల, 'తెలంగానం' అంటూ శ్రీహరి అలవాల, 'మార్పుకై' అంటూ తాతోలు దుర్గాచారి, 'నేలరాలిన ఆఖరి శ్వాస' అంటూ జి.లెనిన్ శ్రీనివాస్, 'మరోప్రపంచ కవి' (పేజీ 62) యశోపాల్, 'అనూహ్య అంకురాలు' పోతగాని సత్యనారాయణ, "శ్రీశ్రీ' స్మారక కవితా సంకలనం రూపొందిస్తే ప్రయోగంగానూ, ప్రయోజనాత్మకంగానూ వుంటుంది. లేదా శ్రీశ్రీ ప్రేరణగా కష్టజీవుల వాణి, బాణీ వినిపించే కవితలు... విస్తృతంగా చైతన్య పూరితంగా

స్వేచ్ఛ కోసం
(కవితా సంకలనం)
సంపాదకులు:
సైదులు ఐనాల, శ్రీనివాసు గద్దపాటి.
పేజీలు : 139, వెల : 75/-,
ప్రాప్తిస్థానం : ఐనాల సైదులు,
సిరిపురం, వైరా మండలం,
ఖమ్మం జిల్లా - 507165.
సెల్ : 9948714105.
గద్దపాటి శ్రీనివాస్,
ఇంటి నెం.4-2-151/ 65/ 1/ సి/1,
శ్రీనివాసనగర్, ఖమ్మం.
సెల్ : 9951660789.



వుండేవి. సంపాదకుల, సంకలనకర్తల ప్రయత్నాన్ని అభినందిస్తూ.... జిల్లాలోని మిగతా అందరు కవుల్ని కలుపుకుంటూ.... మరింత మంచి కవితా సంకలనాలు తీసుకురాగలరని ఆశిద్దాం.

- తంగిరాల చక్రవర్తి

ఆకట్టుకునే 'నల్లకలువ'

నల్లకలువ
కె. ప్రవీణ రెడ్డి
వెల : 70/-, పేజీలు : 204
ప్రతులకు :
విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు

నల్ల కలువ పేరే సూదంటురాయిలా ఆకట్టుకుంది. కథలూ అంతే! పాఠకులను ఆకట్టుకోవడంలో సఫలమయ్యాయి. రచయిత్రి కె.ప్రవీణారెడ్డిలో చుట్టూ వున్న వాతావరణాన్ని, సామాజిక అంశాలను గమనించే సామర్థ్యం వుందనే విషయం కథలు చదువుతుంటే అర్థమవుతుంది. సమాజంలో అంతర్భాగంగా నివసిస్తూ రోజులు గడిపేయడంవేరు. ఆ సమాజాన్ని దగ్గరగా గమనించి అర్థంచేసుకోవడం వేరు! అలా గ్రహించినదాన్ని అక్షరాల్లో మలచి పాఠకుల చెంతకు తీసుకెళ్లగలిగితే రచయిత్రిగా సాఫల్యత చెందినట్లే! ఆ స్పృహ ప్రవీణలో కనిపించింది.

అనేక పత్రికల్లో ప్రచురించిన కథలన్నింటినీ కలిపి సంకలనంగా వెలువరచిన నల్లకలువలో భావ వ్యక్తీకరణ సహజసిద్ధంగా కుదిరింది. నేటి పాఠకులకు కావలసింది సరళమైన భాష కనుక ఆ రకంగా చదవడానికి ఎలాంటి ఆటంకమూ కలగదు.

'కక్ష్య' కథలో మరమనుషుల్లా మారిపోతున్న మనుషుల జీవితాలను అక్షరబద్ధం చేశారు. అలాగే 'నిముషానికి అటూ యిటూ' కథలో మనుషుల ఆలోచనాదృక్పథం సమయాన్ని బట్టి ఎలా మారిపోతుందో చెప్పిన విధానం బావుంది. 'సీతామాలక్ష్మి'లో పేజ్‌త్రీ వ్యామోహాన్ని, త్రిశంకుస్వర్గంలో జీవించే మనస్తత్వాన్ని విశదీకరించారు. 'అమృతహస్తం' మనసుకు హత్తుకునే కథ. 'కోడలి మనసు'లో అత్తగారిపట్ల వ్యవహరించే తీరులో న్యాయంగా తోచిన పద్ధతి, అమ్మకు ఎదురైతే చివుక్కుమనడం చక్కగా చూపించారు. 'తూర్పు-పడమర'లో అనుబంధాల కమ్మదనాన్ని సృశించి, గ్రామీణ ప్రాంతాల స్వచ్ఛమైన ఆప్యాయతలను వర్ణించారు. 'ఎ గుడ్ ఫ్యాట్ హెన్' హాయిగొలిపే కథ. చదువుతుంటే అచ్చం అమ్మమ్మ ఇంటికి వెళ్లినట్లే అనిపించింది. చిన్ననాటి ఉక్రోషాలనూ గుర్తుచేసింది.

'వ్యూహం' కథ సమర్థనీయంగా అనిపించదు. కన్నకూతుర్ని ప్రేమికుల మధ్యనుంచి తొలగించడానికి ఎన్నుకున్న వ్యూహం ఎంతవరకు న్యాయమో రచయిత్రికే తెలియాలి. అరుణారుణం, క్లియోపాత్ర లాంటి కథలు వాస్తవానికి పూర్తిగా దూరంగా వుంటాయి. కథలు మనలోంచే పుట్టుకురావాలి. రాయాలికదా అని రాస్తే అది చదువుతారేమో కానీ, గుర్తుంచుకోరన్న సంగతి రచయిత్రి గ్రహించాలి. అలాంటి అసహజమైన కథే అగ్నిపునీత. కథలో పట్టు రావడంకోసం నేల విడిచి సాము అనవసరం.

ప్రవీణారెడ్డి పరిచయాలన్నీ హైసొసైటీకి చెందినవి కనుక అదే అన్నికథల్లోనూ ప్రతిబింబించింది. అయినా నష్టంలేదు. తెలియనిదానికన్నా తెలిసిందే బాగా చెప్పగలరు కదా?! ఒరకంగా ఆ రకం లైఫ్‌స్టయిల్‌ను అందరికీ పరిచయం చేశారనవచ్చు. ఎన్నుకున్న కథాంశాలన్నీ సున్నితమైనవే! మనసుతో ముడిపడినవే కనుక చదువరులను ఆకట్టుకుంటాయి. మనసుపడే సంఘర్షణను పాఠకులు ఫీలవుతారనడంలో సందేహంలేదు. ఈ నల్లకలువలోని సౌందర్యాన్నీ, ఆహ్లాదాన్నీ ఓ వెన్నెలరేయి చదివి ఆస్వాదించొచ్చు. ఒక్కొక్క రేక(కథ) ఇచ్చే సువాసననూ ఆఘ్రాణించొచ్చు.

- కె. అరుణ



సీసాల ఇల్లు

ఉపయోగించుకోవాలేగానీ ప్రపంచంలో వ్యర్థమని పారేసే వస్తువే ఉండదేమో. అవును మరి మెక్సికన్లు కట్టుకున్న ఇళ్లు చూస్తే అలానే అనిపిస్తుంది మీక్కూడా. ఇంతకూ వాళ్లు ఇళ్లను వేటితో కట్టారా అని ఆలోచిస్తున్నారు కదూ! ఇటుకలకు బదులు మనం వాడి పడేసే ప్లాస్టిక్, గాజు సీసాలను ఉపయోగించి కట్టుకున్నారు. ఖాళీ సీసాల నిండా మట్టి నింపి వాటిని వరుసగా ఇటుకల లాగా పేర్చి ఇళ్లు, వాటి చుట్టూ ప్రహరీ కడతారు. అవి కూడా ఇటుకలతో కట్టినట్టు గట్టిగా ఉంటాయి. దీని వల్ల ఇల్లు అందంగా ఉండడమే కాక ఖర్చు కూడా తగ్గుతుంది.. పైగా కొంత చెత్తను తగ్గించినట్లవుతుంది. ఇంతకీ మొట్టమొదటిసారిగా ఇలా సీసాల ఇల్లు కట్టిందెవరనుకుంటున్నారు? నొవెడాకు చెందిన విలియమ్ ఎఫ్ పెక్ అనే పెద్దమనిషికి ఈ సీసా ఇల్లు ఉపాయం తట్టింది. అదీ ఎప్పుడనుకుంటున్నారు? 1902లో. అందుకోసం ఏకంగా 10,000 సీసాలను ఉపయోగించాడు. అయితే 1980లో దాన్ని పడగొట్టారు. 1905లో టోమ్ కెల్లీ 51,000 సీసాలతో తనకోసం ఒక ఇల్లు కట్టుకున్నాడు. అక్కడ ఇతర వస్తువులు దొరకకపోవడం కూడా అందుకు ఒక కారణం. ఇలాంటి సీసాల ఇళ్లు ఒక్క మెక్సికోలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. ఒక ఐడియా ఒక ఇంటినే కట్టిస్తుంది మరి.

సీతాకోక చిలుకలు

-కె.సాహిల్

జరిగినకథ:

రెండు గొంగళిపురుగులు కలిసిమెలిసి వుండేవి. ఓసారి పెద్ద గాలి వీచడంతో అవి కింద పడిపోతాయి. ఎలాగైనా తమ ఇంటికి చేరుకోవాలని బయలుదేరతాయి. అయితే పొరపాటున ఏనుగు కాలి మీదకు చేరతాయి. ఏనుగు వీటిని గమనించి విషయం అడిగి తెలుసుకుంటుంది. ఆ కథంతా విని జాలిపడి కొద్ది సేపట్లోనే వాటి నివాసం దగ్గర వదిలిపెడుతుంది. అలా క్షేమంగా ఇల్లు చేరిన తర్వాత చాలాకాలం అవి సంతోషంగా గడుపుతాయి. అయితే కొన్నాళ్లకు అవి సీతాకోకచిలుకలుగా మారాల్సిన సమయం ఆసన్నమౌతుంది. దాంతో ప్యూపా ఏర్పాటు చేసుకుని లోపలికి వెళ్లిపోతాయి. అయితే అందమైన సీతాకోకచిలుకలుగా మారాక మళ్లీ కలుసుకోవాలనుకుంటాయి. అన్నీ అనుకున్నట్టే జరగవుకదా. పెద్ద గాలి దుమారం వచ్చి గొంగళిపురుగులున్న ప్యూపాలు రెండూ చెరోవైపుకు కొట్టుకుపోతాయి. చెరోచోట సీతాకోకచిలుకల్లా మారతాయి. ఆ తర్వాత....

సీతాకోక చిలుకలయ్యాక లోకమంతా అందంగా కనిపిస్తుంది వాటికి. హాయిగా రెక్కలుంటాయి. వాటితో తమకన్నా అందమైన పూలమీద వాలి మకరందం స్వీకరిస్తుంటే ఎంత బావుందో వాటికి. అయితే తన తోబుట్టువును అసలు కలుసుకోగలుగుతానా? లేదా? అని రెంటికీ ఒకటే దిగులు. వేరే సీతాకోకచిలుకను కలుసుకున్నప్పడల్లా

"నువ్వు నీ తోబుట్టువును కలుసుకున్నావా?" అని అడిగేవి.

దాదాపుగా రెంటికీ ఒకే సమాధానం వచ్చేది "తోబుట్టువు ఎవరు? ఎవరి గురించి అడుగుతున్నావ్?" అని.

దాంతో అవి రెండూ పాపం నీరసంగా మళ్లీ వెతుకులాట కొనసాగించేవి. అయితే ఇవి కలుసుకున్న సీతాకోకచిలుకలన్నిటికీ ఒక విషయం తెలిసేది. అవి రెండూ తమ తోబుట్టువును వెతుకుతున్నాయని. వాటికి సాయం చేస్తామని కూడా చెప్పేవి.

కొత్త ప్రదేశానికెళ్లినప్పడు ఖాళీగా వుండేవి కావు. అన్నయ్యా, చెల్లెమ్మా అంటూ పాటలు పాడుకుంటూ తేనె పీల్చుకుంటుండేవి. ఓసారి అన్నయ్య సీతాకోకచిలుకకు ఒక గొప్ప ఉపాయం వచ్చింది. అది తన చుట్టూ వున్న కీటకాలన్నిటినీ పిలిచి సాయం చెయ్యమని కోరుతుంది. అదేంటంటే...

"మీకు పాటలు పాడడం బాగా వచ్చు కదా. అందరూ ఒకేసారి మీ తియ్యటి గొంతుతో...చెల్లెమ్మా...ఎక్కడున్నావు? నేను ఇక్కడున్నాను. నువ్వూ వచ్చేసేయ్" అని పాడమంటుంది.

కీటకాలన్నీ సంతోషంగా అదే పాట పాడతాయి. పదే పదే పాడతాయి.

వాటికి ఇలా పాడుతూ ఒక చెట్టుమీద నుంచి మరో చెట్టుమీదికి వెళ్లడం అలవాటైపోతుంది.

ఓసారి ...చెల్లాయి సీతాకోక చిలుకకు ఆ పాట వినిపిస్తుంది.

"ఎవరో తన చెల్లెలి కోసం పిలుస్తున్నట్టుందే. అదే నా అన్నయ్య అయితే ఎంత బావుండు" అనుకుంటూ అటువైపు వెళుతుంది.

అలా వెళ్లిన చెల్లెలు చాలా సంతోషిస్తుంది. ఒక్కో కీటకం తన పేరు పెట్టి పిలుస్తూ వుంటుంది. ఆఖరుకు తన అన్నయ్య కూడా అలాగే పిలుస్తాడు.

"చెల్లెమ్మా! రామ్మా!! నీకోసం నేను ఎంతగానో వెతుకుతున్నానమ్మా. మన అమ్మా నాన్నా మనకు ఒక మాట చెప్పారు గుర్తుందా. మనను చివరి వరకు కలిసే జీవించమన్నారు. గొంగళిపురుగులుగా వున్నప్పడే ఒక ఇంట్లో వున్నాం. అలాంటిది ఇప్పడు సీతాకోక చిలుకలయ్యాక ఎవరికి వారిమయ్యాం. ఇదే నాకు బాధగా వుంది. రామ్మా చెల్లెమ్మా..." అన్నాడు.

అంటే అతనే తను వెతుకుతున్న అన్నయ్య అన్నమాట. ఒకసారి పరిశీలనగా చూసింది. రంగురంగుల రెక్కలతో, ఉత్సాహంగా కనిపించాడు.

సంతోషంగా వెళ్లి తనే చెల్లెలినని చెప్పింది.

అంతే ఇద్దరూ కన్నీళ్లతో గతమంతా గుర్తుచేసుకుంటారు. వీరి కబుర్లు వింటూ కీటకాలన్నీ అక్కడే కూర్చుండిపోతాయి. తర్వాత రెండు సీతాకోకచిలుకలూ కలిసి కీటకాలకు ధన్యవాదాలు చెప్పేసి.... తమ ఇంటిని వెతుక్కుంటూ వెళ్లిపోతాయి.

ఇద్దరు అన్నాచెల్లెళ్లను కలిపినందుకు కీటకాలన్నీ సంతోషంగా తమ గూళ్లకు చేరతాయి.

☺